
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు
3
శనివారం 22 జూన్ 2024








..అనే నేను

శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానంటూ ఎమ్మెల్యేలు శుక్రవారం అమరావతిలోని అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో అన్నమయ్య జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి (టీడీపీ), నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి (టీడీపీ), షాజహాన్ బాషా (టీడీపీ), అరవ శ్రీధర్ (జనసేన), ఆకేపాటి అమర్‌నాథరెడ్డి (వైసీపీ), ద్వారకనాథరెడ్డి (వైసీపీ) శాసనసభలో ప్రమాణం చేశారు.

త్రిశంకు స్వర్గంలో వలంటీర్లు

- రోజూ హాజరు వేస్తున్నా.. పనిలేదు
- ఉంటుందా ? ఊడుతుందా ?
- అయోమయంలో వలంటీర్లు

ఐదు సంవత్సరాల పాటు.. ప్రభుత్వంలో వాళ్లే ముఖ్యభూమిక.. ఎవరికి ఏ సంక్షేమ పథకాలు అందాలన్నా.. వాళ్ల దయా దాక్షిణ్యాలే.. వాళ్ల గురించి చర్చలేని రోజంటూ ఉండేది కాదు. స్వయానా ముఖ్యమంత్రే వాళ్లను.. 'వీళ్లంతా నా సైన్యం' అని బహిరంగంగా ప్రకటించారు. ప్రతిపక్షాలు సైతం వీళ్లు ఉంటే.. ఎన్నికలు పారదర్శకంగా జరగవు.. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తారు.. వీళ్లను విధుల నుంచి పక్కన పెట్టండి మహాప్రభో.. అని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించారు. ఇంతటి ఘనచరిత్ర కలిగిన వాళ్లు ప్రభుత్వం మారగానే.. ఎందుకూ కొరగాని కొయ్యలా మిగిలిపోయారు. వీళ్ల గురించి ప్రస్తుత అధికారపక్షం, ప్రతిపక్షం రెండూ పట్టించుకోవడం లేదు. దీంతో తమను ఆటలో అరటిపండులాగా పక్కన పెట్టేశారని వాపోతున్నారు. ఇంతవరకు చదవగానే.. వాళ్లు ఎవరో ఇట్టే తెలిసిపోయి ఉండాలి. అందరూ ఊహించినట్లుగానే.. వాళ్లే గ్రామ/వార్డు వలంటీర్లు. వీరు రోజూ విధులకు హాజరవుతున్నా.. సచివాలయానికి వెళ్లి బయోమెట్రిక్ హాజరు వేస్తున్నా.. ఏం పని చేయాలో దిక్కుతోచక, ఫలానా పనిచేయండి అని చెప్పే వాళ్లూ లేక దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. ఈ నేపథ్యంలో ఇంతకూ తమ ఉద్యోగం ఉంటుందా ? ఊడుతుందా ? అనే అయోమయంలో జిల్లాలోని వలంటీర్లు కొట్టుమిట్టాడుతున్నారు.



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. నవరత్నాలు సంక్షేమ పథకాల అమలు కోసం గతంలో ఎన్నడూ లేనట్లు గ్రామ, వార్డు వలంటీరు వ్యవస్థను తీసుకొచ్చారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరు చొప్పున వీరిని నియమించారు. ఒక విధంగా చెప్పాలంటే.. ఒక ప్రవేటు సైన్యంగా వైసీపీ ప్రభుత్వం వీళ్లను భావించింది. దీంతో సంక్షేమ పథకాల అమలు సంగతి పక్కన పెట్టి.. పార్టీ కార్యకర్తల్లాగా పనిచేయించడం మొదలు పెట్టింది. ఇక అక్కడి నుంచే వలంటీర్ల వ్యవస్థపైన ప్రతిపక్షాల ఆరోపణలు, ఆందోళనలు మొదలయ్యాయి. అయితే జగన్ ప్రభుత్వం ఇవేవీ పట్టించుకోకుండా.. స్థానిక వైసీపీ నాయకులను సైతం పట్టించుకోకుండా.. వలంటీర్ల మీదే ఆధారపడ్డారు. వీళ్లు తోడుంటే.. మళ్లీ అధికారం తమదే అని గట్టిగా నమ్మారు. దీంతో సార్వత్రిక ఎన్నికలకు ఏడాది ముందు నుంచే.. వలంటీర్లతో ఓటర్ల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించారు. ఓటరు ఆధార్ నంబరు, ఫోన్‌నంబరు, ఆస్తి వివరాలతో పాటు.. తనకు కేటాయించిన 50 ఇళ్లలో ఎవరు టీడీపీ మద్దతుదారులు, ఎవరు వైసీపీ వర్గీయులు అనే సమాచారాన్ని వలంటీర్లు సేకరించారు. ప్రతిపక్ష పార్టీ సానుభూతి ఓటర్ల ఓట్లను తొలగించేందుకు కూడా ప్రయత్నించారనే ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో పెన్షన్ల పంపిణీతో పాటు ఇతరా సంక్షేమ పథకాలను లబ్ధిదారులు అందించే సమయంలో.. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు ఓటు వేయాలని బహిరంగంగానే అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని ప్రతిపక్ష పార్టీల దృష్టి వలంటీర్లపై పడింది. వీళ్ల కదలికలపై అనుక్షణం ఫిర్యాదులు చేశారు.

ఎన్నికల ప్రక్రియలో క్రియాశీలకంగా..

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ తరపున వలంటీర్లు క్రియాశీలకంగా వ్యవహరించారు. ఓటరు జాబితాను పరిశీలించి.. ప్రతిపక్ష పార్టీ ఓటర్ల ఓట్లు తొలగించేందుకు తప్పుడు ఫిర్యాదులు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ తరపున ఓటర్లను ప్రలోభపెట్టే పనులకు శ్రీకారం చుట్టారు. ఓటర్లకు చీరల పంపిణీ బహిరంగంగానే చేశారు. ఈ నేపథ్యంలో వలంటీర్లపైన ఓ స్వచ్ఛంద సంస్థ ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికలు ముగిసే వరకు వలంటీర్లు.. సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు పంపిణీ చేసే విధులకు దూరంగా ఉండాలని, ఎన్నికల ప్రక్రియలో పాల్గొనరాదని ఆదేశాలు ఇచ్చింది. దీంతో బిత్తరపోయిన వైసీపీ.. ఎలాగైనా వలంటీర్లను ఎన్నికల్లో వాడుకోవాలని వాళ్లతో రాజీనామాల అస్త్రాన్ని ప్రయోగించింది. మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో వలంటీర్లతో రాజీనామాలు చేయించారు. తిరిగి మన ప్రభుత్వమే వస్తుంది.. కాబట్టి రాజీనామాలు చేయండి.. ఈ రెండు నెలలు మన పార్టీనే మీకు జీతాలు ఇస్తుందని ఆశలు రేపారు. తాము చెప్పినట్లు రాజీనామాలు చేయని వాళ్లతో.. వైసీపీ నాయకులు బలవంతంగా రాజీనామా చేయించారు. జిల్లాలో మొత్తం 8528 మంది వలంటీర్లు ఉండగా.. అందులో 5419 మంది మాత్రమే ప్రస్తుతం ఉన్నారు. మిగిలిన 3109 మందిలో ఎక్కువ మంది రాజీనామాలు చేయగా.. మరికొంత మందిని ఎన్నికల సంఘం ఆరోపణలతో విధుల నుంచి తొలగించింది. రాజీనామాలు చేసిన వాళ్లను వైసీపీ యథేచ్ఛగా ఎన్నికల్లో వాడుకుంది.

ఆటలో అరటి పండులా..!

ఎన్నికలు అయిపోయాయి. తాము అనుకున్న ప్రభుత్వమూ రాలేదు. టీడీపీ అద్భుతమైన మెజార్టీతో అధికారంలోకి వచ్చింది. దీంతో వైసీపీ నాయకుల మాటలు విని రాజీనామాలు చేసిన వాళ్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అదే సమయంలో రాజీనామాలు చేయని వాళ్ల గురించి కూడా ఎవరూ పట్టించుకోవడం లేదు. రాజీనామాలు చేయని వాళ్లకు మే నెలకు సంబంధించి దాదాపు వేతనాలు పడ్డాయి. ఈ నెలలో ఇప్పటి వరకు ప్రతి రోజూ సచివాలయానికి వెళ్లి బయోమెట్రిక్ హాజరు వేస్తున్నారు. తర్వాత ఏం పనిచేయాలో తెలియక సతమతమవుతున్నారు. వీళ్లకు ఏం పని చెప్పాలో ? కూడా సచివాలయ సిబ్బందికి అర్థం కావడం లేదు. జూన్ నెలకు సంబంధించి జీతాలు ఇస్తారా? ఇవ్వరా కూడా తెలియడం లేదు. కొత్త ప్రభుత్వం ఇప్పటి వరకు వలంటీర్ల గురించి ఎటువంటి నిర్ణయమూ తీసుకోలేదు. అసలు వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తుందా ? లేక రద్దు చేస్తుందా? కూడా తెలియడం లేదు. వలంటీర్లకు రూ.10 వేలు వేతనం ఇస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ప్రకటించారు. ఈ ఒక్క మాట మీదే ఎంతో కొంత ఆశను వలంటీర్లు పెట్టుకుని ఉన్నారు. వైసీపీ నేతల మాటలు విని.. రాజీనామాలు చేసి, ఎటూ కాకుండా పోయామని, ఇక తమ పరిస్థితి ఏంటని వలంటీర్లు ఆవేదన చెందుతున్నారు.

మత్తు.. చిత్తు

- చాపకింద నీరులా గంజాయి
- గుర్రంకొండలో జోరుగా అమ్మకాలు
- పక్కదారి పడుతున్న యువత
- పిచ్చివాళ్లుగా మారుతున్న యువకులు
- కేసులు నమోదైనా భయమెక్కడ ?



గుర్రంకొండ, జూన్ 21: పడమటి మండలాల్లో గంజాయి అమ్మకాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ గంజాయి మత్తుకు యువత అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. ముఖ్యంగా కళాశాల విద్యార్థులనే ఆయుధంగా చేసుకొని అక్రమార్కులు గంజాయి విక్రయాలను సాగిస్తున్నారు. అంతటితో ఆగని అక్రమార్కులు నెమ్మదిగా చిన్న చిన్న మండలాలకు తమ వ్యాపారాలను సాగిస్తూ విద్యార్థులు, వివిధ రకాల పనులు చేసే యువతను మత్తుకు బానిసలుగా చేస్తున్నారు. ఈ మత్తుకు అలవాటు పడ్డ విద్యార్థులు, యువకులు మత్తులో జోగుతూ బంగారు భవిష్యత్‌ను చేతులారా అర్ధంతరంగా నాశనం చేసుకుంటున్నారు. మరికొందరు యువకులు గంజాయికి బానిసలై పిచ్చివాళ్లగా మారిన సంఘటనలు ఉన్నాయి. గంజాయి కొనేందుకు సొమ్ము లేకపోతే యువకులు చిన్న చిన్న దొంగతనాలను చేసేందుకు వెనకాడడం లేదంటే వీరు ఏ స్థాయికి దిగజారారో అర్థం చేసుకోవచ్చు. మత్తులో ఏం చేస్తున్నారో తెలియక భవిష్యత్‌ను ముళ్లపాన్పుగా మార్చుకుంటున్నారు.

గుర్రంకొండ పట్టణం, చుట్టుపక్కల గ్రామాల నుంచి కళాశాల చదువుల నిమిత్తం వందలాది మంది విద్యార్థులు మదనపల్లె, అంగళ్లు, రాయచోటి ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటు న్నారు. దీంతో ప్రతిరోజు వీరు కళాశాలలో వివిధ ప్రాంతాలకు చెందిన యువకులను కలుస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు గంజాయి విక్ర యదారులు నెమ్మదిగా అలవాటు చేస్తున్నారు. దీనికి అలవాటు పడిన విద్యార్థులు కళాశాలకు వెళుతున్నట్లు ఇంటి వద్ద చెప్పి.. వారంలో రెండు రోజులు కూడా కళాశాలకు వెళ్లడం లేదని తెలుస్తోంది. మత్తుకు అలవాటు పడిన విద్యార్థులు, యువకులకు గంజాయి విక్రయదారులు నేరుగా గుర్రంకొండకే వచ్చి గంజాయి అమ్ముతున్నట్లు చర్చ నడుస్తోంది. దీంతో గుర్రంకొండ పట్టణంలో గంజాయి బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది.

దొంగలుగా మారుతున్న యువత

గంజాయి మత్తుకు అలవాటు పడిన యువకులు చాలామంది నిత్యం రోడ్డుపై ద్విచక్ర వాహనాల్లో ఇష్టానుసారంగా తిరుగుతున్నారు. వీరికి గంజాయి కొనుగోలు చేయడానికి సొమ్ము లేకపోవడంతో రాత్రి పూట ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ తీయడం, ఇళ్ల వద్ద ఉండే మోటర్లను దొంగతనం చేయడం చేస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలో కొత్తగా ఇంటి నిర్మాణాలు జరిగే చోట వివిధ రకాల పనిముట్లు చోరీకి గురవుతున్నట్లు ప్రజలు తెలుపుతున్నారు. అలాగే రైతుల వ్యవసాయ పొలాల్లో ఉండే డ్రిప్ పరికరాలను కూడా చోరీ చేస్తునట్లు తెలుస్తోంది. గంజాయి బ్యాచ్‌లు ద్విచక్ర వాహనాలను రోడ్లపై ఇష్టానుసారంగా నడుపుతుండడంతో మహిళలు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ అతివేగం వలన ఇతరులను ప్రమాదాలకు గురి చేస్తున్నారు.

20 మందిపై కేసు నమోదు

గుర్రంకొండ పట్టణంలో గంజాయి బ్యాచ్‌లు అధికంగా ఉన్నాయి. ఈ క్రమంలో గంజాయి బ్యాచ్‌లపై పోలీసులు దాడులు చేసి రెండు కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో 2022 సంవత్సరంలో 8 మందిపై కేసు నమోదు చేశారు. అలాగే గతేడాది ఏప్రిల్ 11న 12 మందిపై మరో కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల్లో 20 మందిపై కేసు నమోదు చేశారు. అయితే మొదటి కేసులోని ఆరు మంది నిందితులు రెండో కేసులో ఉండడం విశేషం. దీంతో ఆరు మంది నిందితులపై పీడీ యాక్టుకు పోలీసులు సిఫార్సు చేశారు.

పిచ్చోళ్లుగా మారుతున్న యువకులు

గుర్రంకొండ పట్టణంలో గంజాయికి బానిసలైన కొందరు యువకులు పిచ్చోళ్లుగా మారారు. ఇందులో భాగంగా ఇందిరమ్మకాలనీకి చెందిన ఓ యువకుడు గంజాయి మత్తుకు బానిసై పిచ్చోడుగా మారాడు. అలాగే పట్టణంలో మరో ఇద్దరు యువకులు కూడా గంజాయి దెబ్బకు మతిస్థిమితం కోల్పోయారు. ప్రస్తుతం తల్లిదండ్రులు వీరికి బెంగుళూరు, హైదరాబాదు వంటి నగరాల్లో చికిత్స చేయిస్తున్నట్లు సమాచారం. ఇలా గుర్రంకొండ పట్టణంలో గంజాయి మత్తులో యువత పక్కదారి పడుతూ బంగారు జీవితాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారు. దీంతో తల్లిదండ్రుల కళ్లముందే పిల్లల జీవితాలు నాశనమవుతుంటే తల్లడిల్లిపోతున్నారు. అధికారులు గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం మోపి న్యాయం చేయకపోతారా అని ఎదురు చూస్తున్నారు.


గంజాయి ముఠా సభ్యులతో పోలీసులు (ఫైల్)

గంజాయి బ్యాచ్‌లపై కేసు నమోదు చేస్తాం..

పట్టణంలో గంజాయి బ్యాచ్‌లున్నట్లు తెలిసింది. ఈ బ్యాచ్‌ల్లో తిరిగే యువకులపై నిఘా ఉంచాం. వీరిని గుర్తించి గంజాయి అమ్మకందారులపై చర్యలు తీసుకొంటాం. అలాగే యువతను పక్కదారి పట్టించే అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతాం.

- నాగార్జున్‌రెడ్డి, ఎస్ఐ, గుర్రంకొండ

వైభవంగా అర్జున తపస్మాన్ ఘట్టం



పీలేరు, జూన్ 21: పీలేరులో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా అర్జున తపస్మాన్ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం తపస్మాన్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం అర్జున వేషధారి ఒక్కో మెట్టుకు ఒక్కో పద్యం ఆలపిస్తూ అధిరోహించిన వైనం అందరినీ అలరించింది. అర్జున తపస్మాన్ ఘట్టాన్ని తిలకించేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. మహిళలు సంతాన ప్రాప్తి కోసం తపస్మాన్ ముందు వరపడ్డారు.

సెలవులో వెళ్లిన రాయచోటి అర్బన్ సీఐ

రాయచోటిటౌన్, జూన్ 21: సార్వత్రిక ఎన్నికల అనంతరం ఇటీవల కాలంలో రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తాడన్న ఆరోపణల నేపథ్యంలో సెలవులో వెళ్లాడు. ఈ నెల 19వ తేది అర్ధరాత్రి 12 గంటల సమయంలో రాయచోటి పట్టణంలోని బాంబే లాడ్జికి సమీపంలో శివారెడ్డి, సయ్యద్ అనే టీడీపీ సానుభూతిపరులను విచక్షణారహితంగా సీఐ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది కలిసి టీడీపీ కార్యకర్తలను అతి దారుణంగా కాళ్లతో తన్ని, కొట్టినట్లు సమాచారం. ఈ సంఘటనపై ఎస్పీ వెంటనే విచారించి సీఐపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు ఉన్నతాధికారులను డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో సీఐ సెలవుపై వెళ్లడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

సంక్షేమశాఖలు సమర్థవంతంగా పనిచేయాలి

- కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 21: జిల్లాలోని సంక్షేమ శాఖలు సమర్థవంతంగా పని చేయాలని, ఆయా సంక్షేమశాఖల ద్వారా ప్రజల అవసరాలను గుర్తించి సమర్థవంతంగా అడుగులు వేస్తే సంక్షేమం సార్థకం అవుతుందని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆ శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియోకాన్ఫరెన్స్ హాలులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగుల, శిశుసంక్షేమ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పై శాఖల్లో ఏయే కార్యక్రమాలు అమలు చేస్తున్నారు, అందులో భౌతిక, ఆర్థిక లక్ష్యం సాధించిన ప్రగతి తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో సంక్షేమ హాస్టళ్లు ఎన్ని వున్నాయి, వాటిలోని విద్యార్థుల సంఖ్య ఎంత, అక్కడ వున్న సౌకర్యాలపై అధికారులతో ఆరా తీశారు. అలాగే మహిళా శిశు సంక్షేమ శాఖలో ఎన్ని ప్రాజెక్టులు వున్నాయి, వాటి పరిస్థితిపై కూడా సంబంధిత అధికారుల ద్వారా తెలుసుకున్నారు. మహిళలు, పిల్లలకు అమలవుతున్న పథకాలు వన్‌స్టాప్ సెంటర్, చైల్డ్ ప్రొటెక్షన్, అర్బన్ హోంలు వికలాంగుల శాఖ ద్వారా అమలు పరుస్తున్న పథకాలు, కార్పొరేషన్ల ద్వారా అమలవుతున్న పథకాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటి బచావో.. బేటి పడావో ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, సంక్షేమ శాఖల ఇన్‌చార్జి అధికారి వెంకటసుబ్బయ్య, బీసీ, మైనార్టీ అధికారి సందప్ప, మస్తాన్, ఐసీడీఎస్ అధికారిణి శశికళ, సీపీఓ క్రిష్ణనాయక్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

టమోటా పంటలో దొంగలు పడ్డారు

- రూ.40 వేలు విలువ చేసే టమోటాలు చోరీ

నిమ్మనపల్లి, జూన్ 21: ప్రస్తుతం టమోటా ధరలకు రెక్కలు రావడంతో సామాన్యులు కొనేలా.. తినేలా లేవు. కిలో దాదాపు రూ.100 పలుకుతుండడంతో టమోటా వైపు కన్నెత్తి చూసేవారు లేరు. ఈ నేపథ్యంలోనే మండలంలోని ఉప్పరపల్లిలో ఓ రైతు సాగు చేసిన టమోటా పంటలో దొంగలు పడిన సంఘటన చోటుచేసుకుంది. వివరాలిలా.. ఉప్పరపల్లికి చెందిన రైతు శ్రీపతి తనకున్న ఎకరా వ్యవసాయ పొలంలో టమోటా పంటను సాగు చేశాడు. ప్రస్తుతం 30 కేజీల క్రేట్ ధర రూ.2 వేలు పలుకుతోంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కాయలు కోసేందుకు క్రేట్‌లు దింపి పంట పొలంలోకి వెళ్లగా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. పండిన టమోటా కాయలు ఒక్కటి కూడా కనిపించకపోవడంతో కన్నీటి పర్యంతమయ్యాడు. గుర్తుతెలియని వారు ఎవరో అపహరించినట్లు తెలుసుకుని దిగులు చెందాడు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ టమోటాకు మంచి ధర వచ్చింది.. అప్పులు తీరుతాయని సంబరపడ్డానని, తీరా కాయలు కోసేందుకు వెళితే కనిపించకుండా పోయాయని లబోదిబోమన్నాడు. దాదాపు 30 క్రేట్ల కాయలు చోరీ అయ్యాయని, వీటి విలువ రూ.40 వేల వరకు వుంటుందని తెలిపారు. అనంతరం పొలం పక్కన వున్న సీసీ ఫుటేజీని పరిశీలించారు. కాగా దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతు తెలిపాడు.


టమోట పంటను చూపుతున్న రైతు శ్రీపతి


నదినీ వదల్లేదు..


- రైల్వేకోడూరులో భూబకాసురులు
- నదీ పరీవాహక ప్రాంతాలనూ వదలని వైసీపీ నేతలు
- తప్పుడు సర్వే నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు
- కబ్జా భూముల్లో ప్లాట్లు వేసి విక్రయాలు
- ప్రభుత్వం మారడంతో ఆందోళనలో కబ్జాదారులు


నదిలోకి నిర్మించిన గోడ

రైల్వేకోడూరు, జూన్ 21: అధికారం మాదేనన్న ధీమాతో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను గత ఐదేళ్లతో వైసీపీకి చెందిన కొందరు భూబకాసురులు కబ్జా చేసి దర్జాగా అనుభవిస్తున్నారు. ఆ భూముల్లో ప్లాట్లు వేసి అమాయక ప్రజలకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. తప్పుడు సర్వే నెంబర్లు సృష్టించి కొన్ని ప్రభుత్వ భూములను ఏకంగా వారి పేర్లతో రిజిస్ట్రేషన్లు కూడా చేయించుకున్నారు. వివరాల్లోకి వెళితే....రైల్వేకోడూరు పరిధిలో నదీ పొరంబోకు భూములు సర్వే నెంబరు 1599-ఏలో 101.80 ఎకరాలు ఉన్నాయి. ఇందులో 50 ఎకరాలను ఖద్దరు అండదండలతో కొందరు వైసీపీ నాయకులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు సిండికేటుగా మారి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆ భూములను కబ్జా చేసిన వారు ఒక వైసీపీ ముఖ్య నేతకు లక్షలు ముట్టచెప్పినట్లు ఆ పార్టీలోని కొందరు చెబుతున్నారు. అదేవిధంగా ఒక అధికారికి కూడా లక్షలాది రూపాయలు చెల్లించినట్లు వైసీపీ నాయకులే బహిరంగంగా చెప్పుకున్నారు. నదీ పొరంబోకు భూములు సుమారు 30 ఎకరాలను తప్పుడు సర్వే నెంబరు 2042/1,2,3,4, 2086గా సృష్టించి సుమారు మరో 20 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలుస్తోంది. సర్వే నెంబరు 635 వేసి 75 సెంట్ల ప్రభుత్వ నదీ పొరంబోకు స్థలాన్ని స్వాధీనం చేసుకుని పాట్లు వేసి, రోడ్లు వేసి దర్జాగా విక్రయించేశారు. రైల్వేకోడూరుకు చెందిన వైసీపీ నేత, అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుల దండదండలతో కబ్జాలు చేసి కోట్లాది రూపాయలు సంపాదించారు. మైసూరివారిపల్లె నుంచి చిట్వేలి రోడ్డు వరకు నదీ పొరంబోకు స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేశారు. ప్రజా ప్రతినిధులకు, బడా నాయకులకు, అధికారులకు డబ్బులు విరజల్లుతున్నామని తమను ఎవరూ ఏమీ చేయలేరని కబ్జాదారులు వైసీపీ ప్రభుత్వ హయాంలో చెప్పుకున్నారు.

పాతబజారుకు సమీపంలో ఒక తోట ఉండేది. గుంజన నది పక్కన తప్పుడు సర్వే నెంబరు వేసి 75 సెంట్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని విక్రయాలు సాగించారు. నదీ పొరంబోకు స్థలాలకు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించడం, తప్పుడు సర్వే నెంబర్లు వేయించడంలో రైల్వేకోడూరు వైసీపీలో సిద్ధహస్తులు ఉన్నారు. వారికి ఖాళీగా ఉన్న భూమి కనిపించిందంటే చాలు రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు చెప్పి ఇలా చేసుకుంటే మీకు లాభాలు దండిగా వస్తాయని సలహాలు, సూచనలు ఇచ్చి ఆ స్థలాన్ని కబ్జా చేసిన ప్లాట్లుగా మార్చి విక్రయించేశారు. మైసూరివారిపల్లె ప్రధానదారి ప్రైవేటు మార్కెట్ యార్డు పక్కనే కోట్ల రూపాయల విలువ చేసే 50 సెంట్ల ప్రభుత్వ భూమిని కాజేసేందుకు విపరీతంగా ప్రయత్నాలు సాగాయి. వైసీపీ నేత ఒకరు ఏకంగా 2.5 ఎకరాల భూమిని కాజేసేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేశారు. అదేవిధంగా చిట్వేలి రూటు లో చాలామంది తప్పుడు సర్వే నెంబర్లు వేసుకుని ఇంటి నిర్మాణాలు చేపట్టారు. వారందరికీ రెవెన్యూ శాఖాధికారులు గతంలో నోటీసులు జారీ చేసినా వాటిని వైసీపీ పెద్దలు అడ్డుకున్నారు. మైసూవారిపల్లె నుంచి చిట్వేలి రూటు వరకు రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు నోటీసులు ఇచ్చినా ఫలితం లేదు. యథేచ్ఛగా కబ్జాలు కొనసాగుతున్నాయి. కాగా వివాదంలో ఉన్న ఒక సినిమా థియేటర్‌ను ఇటీవల కొందరు నాయకులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కలసి కొనుగోలు చేశారు. దాని ముందు భాగం లో ఉన్న రోడ్లు భవనాల శాఖకు చెందిన 50 సెంట్ల భూమిని కాజేసేందుకు ప్రయత్నించారు. గాంధీనగర్ సమీపంలో ఉన్న కల్యాణ మండపాల భూమి వివాదం కూడా కలకలం రేపింది. ఆ భూమిలో చాలామంది వైసీపీ ఖద్దరు బాబులు విపరీతంగా లాబీయింగ్ నడిపారు. ఇదేకాకుండా వైసీపీ ఖద్దరు ముసుగులో ఉన్న ఎర్రచందనం స్మగ్లర్లు కన్నెగుంట ప్రాంతంలో సుమారు 100 ఎకరాలను ఆక్రమించుకుని భూములను సాగు చేస్తున్నారు. ఇదేకాకుండా పుల్లంపేట, పెనగలూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె మండలాల్లో కోట్లాది రూపాయల విలువ చేసే భూములను వైసీపీ నేతలు కబ్జా చేశారు. కోడూరు మండలంలోని ఎస్.కొత్తపల్లెకు చెందిన గిరిజనుల భూములను ఆక్రమించిన వైసీపీ నాయకులు వారిని అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని గిరిజనులు వాపోతున్నారు. దీనిపై సీపీఐ నాయకులు ఆందోళనలు చేసినా అధికారులు పట్టించుకోలేదు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందన్న భ్రమలో ఎక్కడ ప్రభుత్వ భూమి కనిపించినా కబ్జా చేసిన వైసీపీ నాయకులు ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో తమ పరిస్థితి ఏమిటో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. భూ కబ్జాలపై ఉన్నత స్థాయి కమిటీ చేసి విచారణ చేసి భూబకారుసులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గుంజన నదిలోకి వెళ్లిపోయిన ప్రహరీ గోడ


ఏకంగా నదీ స్థలాన్నే ఆక్రమించిన దృశ్యం


ఎన్నికల విధులకు గైర్హాజరైన వారిపై చర్యలేవి?

- తిరిగి వైసీపీ వస్తుందనే ధీమాతోనే విధులకు దూరం
- చర్యలకు ఆదేశించినా ముందుకు కదలని ఫైల్

కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూన్ 21: జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎన్నికల విధులు కేటాయించినప్పటికీ వెళ్లకుండా గైర్హాజరయ్యారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి విజయరామరాజు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులు విధులకు గైర్హాజరైన వారికి ముందుగా నోటీసులు ఇచ్చారు. వారి వివరణతో కలెక్టరుకు ఫైలు పంపారు. ఈ మేరకు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ కలెక్టరు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. కానీ కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారనే చర్చ డీఆర్‌డీఏలో సాగుతుంది. జిల్లాకు సమీపంలో ఉన్న రెండు మండలాలకు సంబంధించిన ఇరువురు సెర్ప్ సిబ్బంది ఎన్నికల అధికారి ఉత్తర్వులు బేఖాతరు చేస్తూ ఎన్నికల విధులకు గైర్హాజరు అయినట్లు తెలుస్తుంది. వైసీపీ ప్రభుత్వంలో నేతలతో మంచి పరిచయాలు ఉండడంతో పాటు తిరిగి వైసీపీ అధికారంలోకి వస్తుందనే విశ్వాసంతో ఆ అధికారులు తమను ఏమీ చేయలేరనే ఆలోచనతోనే ఎన్నికల విధులకు డుమ్మా కొట్టినట్లు సహచర ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది.

ఎన్నికల విధులకు గైర్హాజరైతే...

ఎన్నికల విధులకు ఏదైనా కారణం చేత ఉద్యోగులు గైర్హాజరయ్యే పరిస్థితి ఉంటే అందుకు గల కారణం చూపుతూ రిటర్నింగ్ అధికారి లేదంటే అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అనుమతి మేరకు విధులకు గైర్హాజరు కావచ్చు. అదే ఆరోగ్య సమస్యలు అయితే వ్యాధికి సంబంధించిన వైద్యుల ధ్రువీకరణ పత్రాలతో రిటర్నింగ్ లేదా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. కానీ డీఆర్‌డీఏ అనుబంధంగా పనిచేస్తున్న సెర్ప్ సిబ్బంది ఇవేవీ పాటించలేదని సమాచారం. జిల్లా కలెక్టరు, ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ ఉన్నతాధికారులు ఎన్నికల విధులకు గైర్హాజరైన సిబ్బందికి నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తుంది. నోటీసుతోనే సరిపెట్టారు.. ఎన్నికల నిబంధనల మేరకు ఎటువంటి చర్యలు తీసుకోకుండా డీఆర్‌డీఏలోని ఉన్నతాధికారి ఒకరు వీరికి అభయం ఇస్తున్నట్లు తెలుస్తుంది.

కలెక్టరు ఆదేశాలు సైతం..

ఎన్నికల విధులకు గైర్హాజరైన సిబ్బందిపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో సిబ్బందికి ఇరువురికీ ఇంక్రిమెంట్లు కట్ చేయమని ఆదేశాల్లో పేర్కొన్నట్లు సమాచారం. అయితే వీటిని పట్టించుకోకుండా ఫైల్‌ను తొక్కి పెట్టినట్లు చర్చ సాగుతుంది. ఇప్పుడు ఇంక్రిమెంటు కట్ చేసిన వారిలో ఒకరికి ఇది వరకే వేరే కారణంతో రెండు ఇంక్రిమెంట్లు కట్ చేసినట్లు సమాచారం. అయినప్పటికీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రాంతానికి చెందిన ఈ వ్యక్తి పనితీరులో మార్పు రాలేదని సహచర ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఇక మరో మండలానికి చెందిన అధికారి పనిచేస్తున్న మండలంలో కూడా భారీ స్థాయిలో నిధులు అక్రమాలు జరగడం, విచారణలో రుజువు కావడం జరిగాయి. దాదాపు కోటి రూపాయల మేర ఆర్థికపరమైన నేరం జరిగినప్పటికీ కనీసం పోలీసు కేసు కూడా నమోదు కాలేదు. ఇందులో గత ప్రభుత్వంలోని పాలకుల ద్వారా పోలీసుల పై వత్తిడి తీసుకువచ్చి కేవలం ఫిర్యాదుతోనే సరిపుచ్చిన పరిస్థితి ఆ మండలంలో నెలకొంది. ఇంతలా రాజకీయ పలుకుబడి ఉన్న ఈ ఉద్యోగులపై కలెక్టరు ఆదేశాలు పనిచేయడం లేదు. వీరిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా డీఆర్‌డీఏలోని అధికారులు కాపాడుతున్నట్లు తెలుస్తుంది.

నోటీసులు ఇచ్చాం...

ఎన్నికల విధులకు గైర్హాజరైన సిబ్బందికి నోటీసులు ఇచ్చాం. నోటీసులు అందుకున్న వారు అనారోగ్య కారణాల వల్ల విధులకు హాజరు కాలేకపోయామని సంజాయిషీ ఇచ్చారు. ఇంక్రిమెంట్లు కట్ చేయాలంటూ ఆదేశాలు వచ్చాయనడం అవాస్తవం.

-ఆనంద్‌నాయక్, డీఆర్‌డీఏ, పీడీ

పరిశుభ్రత పాటించాలి : డీఆర్ఎం



డీఆర్ఎంకు వినతి పత్రం అందిస్తున్న స్థానికులు

ముద్దనూరు జూన్ 21: రైల్వే స్టేషన్‌లోని పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని డీఆర్ఎం వినీత్‌సింగ్ సిబ్బందికి సూచించారు. స్థానిక రైల్వేస్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అందులో భాగంగా రైల్వే స్టేషన్‌లోని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ప్రయాణికులకు తాగునీటి వసతి, వేచిఉండుగది, ప్లాట్ ఫారం పై ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బల్లలు, జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే గేట్లను ఆయన పరిశీలించారు. ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం బీజేకేఎం నాయకులు రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్‌లో కరోనా సమయంలో చాలా ప్యాసింజర్ రైళ్ల స్టాపింగ్ లేకుండా చేశారన్నారు. తిరిగి ప్రయాణికుల సౌకర్యార్థం పునరుద్ధరించాలని, ధర్మవరం నుంచి విజయవాడ వెళ్లు రైలుకు స్టాపింగ్ ఇవ్వాలని డీఆర్ఎంకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీనియర్ డీఎన్‌వో చంద్రశేఖర్, డీవోఎం సుధీర్, స్టేషన్ మేనేజర్ భాస్కర్, సీటీఎన్‌సీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



దూదేకుల హుస్సేనయ్య

మైలవరం, జూన్ 21: మండల పరిధిలోని వద్దిరాల గ్రామ సచివాలయ సమీపంలోని పొలంలో దూదేకుల హుస్సేనయ్య (34) అనే యువకుడు శుక్రవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... పెద్దముడియం గ్రామానికి చెందిన దూదేకుల హుస్సేనయ్య మైలవరం మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామ సమీపంలోని కంకర మిషన్‌లో ప్రొక్లెయిన్ ఆపరేటర్‌గా గత 9 సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. హుస్సేనయ్యకు మద్యం సేవించే అలవాటు ఉండటంతో గురువారం సాయంత్రం విధులు ముగించుకుని వద్దిరాల గ్రామంలోని వైన్ షాపు వద్దకు వచ్చి మద్యం కొనుగోలు చేసి వెళ్లాడు. అయితే ఏం జరిగిందో ఏమో కానీ గురువారం ఉదయం స్థానికులు సచివాలయం ఎదురుగా ఉన్న పొలంలో ఎవరో మృతి చెందారని తలమంచిపట్నం పోలీసులకు సమా చారం అందించడంతో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమి త్తం జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హుస్సేనయ్యకు భార్యతో పాటు కూతు రు, కుమారుడు ఉన్నారు. మద్యం ఎక్కువగా సేవించి మృతి చెందాడా.. ఇంకా ఏ ఇతర కారణాలు ఉన్నాయో తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తలమంచిపట్నం హెడ్ కానిస్టేబుల్ హరికృష్ణ తెలిపారు.

ముగిసిన శ్రీవారి సహస్ర కలశాభిషేక ఉత్సవాలు





ఇరువురు దేవేరులతో కొలువుదీరిన శ్రీవారు, కలశాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కడప (కల్చరల్) జూన్ 21: తిరుమల తొలి గడప దేవుని కడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 19వ తేదీ బుధవారం నుంచి 21వ తేదీ వరకు నిర్వహించిన శ్రీవారి సహస్ర కలశాభిషేకం ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి.

చివరి రోజు (శుక్రవారం) ఉదయం 7గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు త్రివిక్రమ్, కృష్ణమోహన్, సాయి, తరుణ్, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, మహాశీర్వాదం తదుపరి సాయంత్రం 5 గంటలకు స్వామి వారి గ్రామోత్సవం కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

యోగా ఒక దివ్య ఔషధం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి



యోగా కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉద్యోగులు

కడప(రూరల్) జూన్ 21: యోగా ఒక దివ్య ఔషధమని.. క్రమం తప్పకుండా యోగా చేస్తే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాసదన్‌లో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ యోగాను రోజువారి దినచర్యలో భాగంగా చేస్తుండడం వలన మంచి ప్రయోజనం ఉంటుందన్నారు. యోగా వత్తిడి తగ్గించి శారీక బలాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. శ్వాసప్రక్రియలో ఇబ్బందులు తొలగుతాయన్నారు. బరువు తగ్గాలనుకునేవారికి యోగా అద్భుత ఔషధమన్నారు. అనంతరం న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులతో యోగా మాస్టర్ యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ అహమ్మద్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్, ఆయా కోర్టుల జడ్జీలు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడిన ఎర్రచందన దుంగలతో ఫారెస్టు అధికారులు

సుండుపల్లె జూన్ 21; అక్రమంగా ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి 6 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు సానిపాయి ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున సానిపాయి బీట్ కాల్వుల బండ ప్రదేశంలో అక్రమంగా ఎర్రచందనం రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న వ్యక్తులపై దాడులు నిర్వహించి.. వారి వద్ద నుంచి 6 దుంగలను, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలపారు. దుంగల విలువ రూ.45,341లు ఉంటుందన్నారు. మరి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు, సిబ్బంది, బేష్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు

కోదండరాముని దర్శించుకున్న ఎస్పీ



కోదండరాముని దర్శించుకున్న ఎస్పీ సిద్ధార్థ కౌశిల్

ఒంటిమిట్ట, జూన్ 21: ఏకశిల నగిరి కోదండరామాలయాన్ని జిల్లా ఎస్పీ సిద్ధార్థకౌశిల్ కుటుంబ సభ్యులతో శుక్రవారం ఉదయం సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి టీటీడీ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మూల విరాట్ అయిన సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రంగ మండపంలో ఆలయ విశిష్టతను, చరిత్రను తెలుసుకుని వేద పండితుల ఆశీర్వచనం పొందారు. వీరికి టీటీడీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. సీఐ పురు షోత్తంరాజు, సిద్దవటం ఎస్ఐ పెద్దఓబన్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ బీట్ పునర్విభజన అనుమతి కోసం నివేదిక

సిద్దవటం జూన్ 21: అటవీశాఖ సిబ్బంది పని భారాన్ని తగ్గించడం, వన్యప్రాణులు, అటవీ భూముల సంరక్షణలో భాగంగా అటవీ బీట్ల పునర్విభజన చేయనున్నట్లు సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి తెలియజేశారు. సిద్దవటం రేంజి పరిధిలో 36వేల హెక్టార్లలో అటవీ ప్రాంతం ఉండగా, ప్రస్తుతం 7 బీట్లు మాత్రమే ఉన్నాయని, దీనిని 23 బీట్లకు పెంచేందుకు ప్రపోజల్ పంపామన్నారు. ఈప్రాంతంలో ఎర్రచందనం అక్రమ రవాణా కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అడవి జంతువులను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

లంకమల్లేశ్వరం అటవీ ప్రాం తంలో పెద్దపులి, చిరుతపులి, దుప్పి, కణితి, ఎలు గుబంటి తదితర వన్యప్రాణులతో పాటు, గోపాలస్వామి, నిత్యపూజయ్య స్వామి, కపిలతీర్థ స్వామి, దుర్గమ్మ ఆలయాలు ఉన్నాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు మృతి

కడప (క్రైం), జూన్ 21: కడప నగర శివార్లలో గురుకుల పాఠశాల సమీపంలో ఆర్టీసీ బస్సు, కారును ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న రాజమోహన్ (58) శుక్రవారం మృతి చెందాడు. ఈ సంఘటనలో రామయ్య, రాజమోహన్ కుమారుడైన గురురోహిత్ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో తీవ్రంగా రాజమోహన్, అతని భార్య లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడ్డారు. వీరు చికిత్స పొందుతుండగా రాజమోహన్ మృతి చెందాడు. రాజమోహన్ మృతదేహానికి రిమ్స్ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.

8మంది జూదరుల అరెస్టు

పెద్దమండ్యం, జూన్ 21: మండలంలోని పాపేపల్లి గ్రామ పంచాయతీ గొల్లవానికుంట సమీపంలో ములక లచెరువు సీఐ మధు ఆధ్వర్యంలో శుక్రవారం జూదర్ల స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 8 మంది జూదర్లను అరెస్టు చేసి వారి నుంచి రూ.1,01,060 (1లక్ష వెయ్యి అరవై రుపాయాలు) నగదు స్వాధీనం చేసుకున్నట్లు పెద్దమండ్యం ఎస్ఐ చలపతి తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్య

మదనపల్లి అర్బన్ జూన్ 21: మదనపల్లి మండలం అంకిశెట్టిపల్లి రామాపురంకి చెందిన ఐ.శ్రీనివాసులు (58) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇతను మునిసిపాలిటీలో నీటిసరఫరా చేసే ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఉద్యోగం తీసేస్తామని స్థానిక వ్యక్తి వచ్చి చెప్పడంతో అప్పటికే ఆర్థిక సమస్యలతో ఉన్న శ్రీనివాసులు మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నారు. తాలూక సీఐ యన్ శేఖర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్ఆర్ కడప జిల్లాగా పేరు మార్చాలి



మాట్లాడుతున్న తులసిరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 21: కడప పేరు వాడుకలో ఉన్నందున చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ జిల్లాకు వైఎస్ఆర్ కడప జిల్లాగా తెలుగుదేశం ప్రభుత్వం పేరు మార్చాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1808లో కడప జిల్లా ఏర్పాటైందన్నారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి నిలయమైన తిరుమలకు తొలిగడప దేవుని గడప అని, అందువలనే ఈ జిల్లాకు కడప జిల్లాగా పేరు వచ్చిందన్నారు. అయితే 2009లో ఈ జిల్లావాసి అయిన ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అకాల మరణంతో ఆయన జ్ఞాపకార్థం వైఎస్ఆర్ జిల్లాగా పేరు మార్చారని తెలిపారు. రాజశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం వేంకటేశ్వరస్వామి గుర్తుగా వైఎస్ఆర్ కడప జిల్లాగా పేరు మార్చితే బాగుంటుందని సూచించారు. ఉదయం కొవ్వూరు గ్యారేజీలో బీజేపీ నాయకుడు కొవ్వూరు బాలచంద్రారెడ్డి భౌతికకాయానికి తులసిరెడ్డి, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులు అర్పించి.. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎండీ నజీర్, పట్టణాధ్యక్షుడు జిలానీబాష, అమర్‌నాథ్‌రెడ్డి, సుబ్బరాయుడు, మహబూబ్‌బాష, వినయ్, జావీద్, తదితరులు పాల్గొన్నారు.

మరిచిపోయిన మొబైల్ ఫోన్‌ను అప్పగించిన టీటీఈ



సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న టీటీఈ ఎలిజబెత్‌రాణి

కడప (క్రైం), జూన్ 21 : వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి తన మొబైల్‌ను రైలులో గురువారం రాత్రి మరిచిపోయాడు. ఆ రైలులో ప్రయాణం చేస్తున్న టీటీఈ ఎలిజబెత్ రాణి ఆ ఫోన్‌ను గుర్తించి దాన్ని ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసులుకు అప్పగించింది. శుక్రవారం ఉదయం బాధితుడు శైలేంద్ర సింధుకు మొబైల్‌ఫోన్‌ను ఆర్పీఎఫ్ పోలీసులు అందించారు. ఈ సందర్భంగా టీటీ ఈ ఎలిజబెత్‌రాణి, ఆర్పీఎఫ్ ఎస్ఐ నాగభూషణం, కానిస్టేబుల్ సౌజన్యను ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసులు అభినందించారు.

బీమా కోసమే హత్య : సీఐ

చెన్నూరు, జూన్ 21 : బీమా కోసమే కనుపర్తి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి హత్య జరిగిందని సీఐ శంకర్ నాయక్ తెలిపారు. చెన్నూరు వద్ద జాతీయ రహదారిపై ఈనెల 19న నారాయణరెడ్డి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టి చెన్నూరుకు చెందిన బాలగురుప్రసాద్‌రెడ్డి హత్య చేసినట్లు గుర్తించి అరెస్టు చేసి.. అతనిపై కేసు నమోదు చేశారు. సీఐ వివరాల మేరకు.. ఆర్థిక సమస్యలతో ఇబ్బందిపడే బాలగురుప్రసాద్‌రెడ్డి ఎనిమిదేళ్ల క్రితం నారాయణరెడ్డి పేరుపై శ్రీరాం ఫైనాన్స్‌లో రూ.12 లక్షలకు బీమా చేశారు. ఆ డబ్బును పొందేందుకు ఓ పథకాన్ని రచించి నారాయణరెడ్డిని ఈ నెల 19న చెన్నూరు వద్ద జాతీయ రహదారిపై బాగా మద్యం తాగించి సిమెంటు దిమ్మెతో మోది హత్యచేశాడన్నారు. అలాగే దాన్ని ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని పక్కనే ఉన్న హైవేపై పడేశాడని సీఐ తెలిపారు.

బొప్పాయి పంట ధ్వంసం

కలికిరి, జూన్ 21: మండలంలోని పత్తేగడ పంచాయతీ కొండకావలిపల్లె సమీపంలో బొప్పాయి పంటను ధ్వంసం చేసిన ఘటనపై పోలీసు స్టేషన్‌లో కేసు నమో దైంది. కలికిరి బీడీ కాలనీలో కాపురమున్న రైతు శేఖర్. నాగమణి దంపతులు కొండకావలపల్లె సమీపంలో 4 ఎకరాలను కౌలుకు తీసుకుని బొప్పాయి పంటను వేశారు. దాదాపు రూ.6 లక్షలు పెట్టుబడిగా పెట్టారు. బొప్పాయి పంటకు కోతకు రానున్న తరుణంలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి పంటను ధ్వంసం చేశారు. వరి ఫైరు కోసే కొడవళ్ళతో బొప్పాయి చెట్లకు న్న కాయలను కోసి పడేశారు. ఇంకో వారం రోజుల్లో పంట కోతకు వస్తున్న దశలో దాదాపు ఐదు టన్నుల పంటను ధ్వంసం చేయడంతో కౌలు రైతు దంపతులు లబోదిబోమంటున్నారు. ఈ మేరకు పోలీసులకు శుక్రవారం కేసు దర్యాప్తులో భాగంగా పంట ధ్వంసం చేయడానికి ఉపయోగించిన కొడవళ్ళను స్వాధీనం చేసుకుని నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఘర్షణ కేసులో ఇద్దరు అరెస్టు

కడప (క్రైం), జూన్ 21 : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో రాజీవ్‌పార్కు సమీపంలో ఈ నెల 19న రాత్రి జరిగిన ఘర్షణ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. నిందితుల్లో విష్ణువర్ధన్ అలియాస్ విష్ణు, నరసింహాచారి అలియాస్ నరసింహను శుక్రవారం రాజారెడ్డివీధిలో సీఎస్ఐ గ్రౌండ్‌కు వెళ్లే దారిలో సీఐ భాస్కర్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

బలవంతంగా రాజీనామా చేయించి.... నట్టేట ముంచారు

- ముఖం చాటేస్తున్న నాయకులు
- ఫిర్యాదులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్న వలంటీర్లు

పులివెందుల రూరల్, జూన్ 21: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించడం, లబ్ధిదారులకు పథకాలు అందించడంలో ప్రముఖ పాత్ర మాది. ప్రభుత్వం అందించే గౌరవ వేతనం రూ.5వేలు తీసుకుంటూ ప్రభుత్వ పథకాలు అందించాం. వేతనం పెంచాలని అడిగితే మీరు వలంటీర్లు..సేవ చేసేందుకు మిమ్మిల్ని నియమించాం.. మీకు మంచి గుర్తింపు వస్తుంది.. ఎవరి మాటా వినకండి అని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. ఐదేళ్లపాటు ప్రభు త్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందిస్తూ వచ్చాం. పథకాల గురించి ప్రజలు తమనే అడిగేవారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం ఎన్నికలకు తమను ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. అయితే ఎన్నికలకు వలంటీర్లను ఉపయోగించుకోవద్దు అంటూ కోర్టు నుంచి తీర్పు వచ్చింది. దీంతో రాజీనామా చేయించాలని ప్రభుత్వ పెద్దలు గట్టిగా నిర్ణయించారు. అయితే ఐదేళ్లుగా ఊడిగం చేశాం, ఉన్నట్లుండి రాజీనామా చేయమంటే ఎలా అని ఆందోళన చేశాం. ఇళ్ల వద్దకు రావడం, ఫోన్ల ద్వారా తీవ్రంగా బలవంతం చేశారు. ఈ టార్చర్ భరించలేక రాజీనామా చేశాం. ఇపుడు తాము ఎదుటపడితే ముఖం తిప్పుకొని వెళ్తున్నారంటూ మున్సిపల్ పరిధిలోని దాదాపు 300 మందికి పైగా రాజీనామా చేసిన వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం పులివెందుల మున్సిపాలిటీలోని వలంటీర్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి వినతిపత్రం అందించారు. తమను తిరిగి విధుల్లో చేర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. కడపలో మీటింగ్ ఉందని, పరిశీలిస్తానని కమిషనర్ హడావిడిగా వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా.. తమ ఇళ్ల వద్దకు వచ్చి బెదిరించి, భయపెట్టి, కుటుంబ సభ్యులతో ఒత్తిడి తెచ్చిన సచివాలయ కన్వీనర్లు, కౌన్సిలర్లపై పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు ఇచ్చేందుకు వలంటీర్లు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రజలలో వ్యతిరేకత ఉందని వలంటీర్లకు ముందే తెలిసింది కాబట్టే రాజీనామాకు వారు ఒప్పుకోలేదని తెలుస్తోంది. కొందరు రాజీనామా చేసినప్పటికి వైసీపీ ప్రచారంలో పాల్గొనలేదు.



పులివెందుల మున్సిపల్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న వలంటీర్లు



మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న వలంటీర్లు


కోడూరు అనంతరాజుపేట ఉద్యాన కళాశాల లో యోగా చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు


లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ పాఠశాలలో యోగా నిర్వహిస్తున్న విద్యార్థులు


సుండుపల్లె: యోగాభ్యాసం చేస్తున్న బీజేపీ నాయకులు


పెనగలూరు ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

యోగాతోనే పరిపూర్ణ ఆరోగ్యం

సంబేపల్లె జూన్ 21; పరిపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యమని డీఈఓ శివప్రకాశ్‌రెడ్డి తెలిపారు శుక్రవారం సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రెటరీ మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .యోగాతో పరిపూర్ణ ఆరోగ్యంతో పాటు, శారీరక, మానసిక వికాసం కలుగుతుందన్నారు ప్రతి ఒకరు యోగాను దైనందిన జీవనంలో భాగం చేసుకుంటామని ప్రతినబూనాలన్నారు. యోగా శిక్షకురాలు విజయలక్ష్మి డీఈవో, ఉపాధ్యాయులు, విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు డీఈవో బహుమతులు అందజేశారు స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు తృతీయా సోపాన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మడితాటి నరసింహారెడ్డి, యోగా జిల్లా నోడల్ అధికారి జనార్దన్, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ట్రెజరర్ మార్ల ఓబుల్‌రెడ్డి, అసిస్టెంట్ ఆర్గనైజర్ లక్ష్మీకర్, ట్రైనర్ విజయలక్ష్మి , మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: యోగా సాధనతో సంపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ కే. గోపాల్ తెలిపారు. యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉద్యాన యూనివర్సిటీ విద్యార్థులు, ఆచార్యులు, సిబ్బంది యోగా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేస్తే వ్యాధులు దూరంగా ఉంటాయన్నారు. బాగా యోగాసనాలలు చేసిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లీలావతి, యోగా మాస్టర్ వెంకటశివ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వై. దీప్తి, కిరణ్, డాక్టర్ నిశ్చల, వై. రవిశంకర్‌రాజు, ఫిజికల్ డైరెక్టర్, కళాశాల సిబ్బంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. విశ్వహిందూపరిషత్ ప్రఖండ అధ్యక్షుడు దరిశా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

లక్కిరెడ్డిపల్లె: స్థానిక ఏపీ మోడల్ స్కూల్, శ్రీవెంకటేశ్వర ఎయిడెడ్ జూనియర్ కళాశాల, విశ్వభారతి హైస్కూల్, కేజీబీవీ, గురుకుల, ప్రైవేటు పాఠశాలల్లో యోగా డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జీ ఎంపీడీవో పట్నాయక్, ఎంఈవో వెంకట సుబ్బయ్య మాట్లాడారు. ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి, యో గా మాస్టర్ సోమశేఖర్‌నాయక్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుండుపల్లె: మండల కేంద్రంలో రాజంపేట అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ రామజగదీష్ ఆధ్వర్యంలో యోగ దినోత్సవాన్ని నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు నాగరాజ, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ నాయుడు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సుబ్బరాజు, కిసాన్‌మోర్చా జోనల్ ఇన్‌చార్జి వెంకటరామరాజు, మండల ఉపాధ్యక్షుడు రెడ్డెయ్యఆచారి, విశ్వహిందూ పరిషత్ నాయకులు రెడ్డెయ్య, గోపాల్‌రాజు, సత్యం నాయుడు, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అమర్‌నాథ్, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు, శ్రీనాథరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

చిన్నమండ్యం: మండల వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడుతూ యోగాతో శరీర దృఢత్వంతో పాటు ఏకాగ్రత, చురుకుదనం సాధించవచ్చునని తెలిపారు. ప్రిన్సిపాల్ రమేష్, మోడల్ స్కూల్ ఎన్‌ఎస్‌ఎస్ పీవో శివప్రసాద్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనగలూరు: మండలంలోని ఉన్నత పాఠశాలలో స్థానిక పాఠశాలల హెడ్మాస్టర్ల ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. పెనగలూరు ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ మధుసూదన్ రెడ్డి, పీడీ డాక్టర్ ప్రణవి, ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ సహజ, పీడీ వెంకట సుబ్బయ్య, చక్రంపేట ఉన్నత పాఠశాలో హెడ్మాస్టర్ గోపాలకృష్ణ పీడీ జయలక్ష్మీ యోగా సనాలను వేయించారు.


సంబేపల్లె: విద్యార్థులతో కలిసి యోగా చేస్తున్న డీఈవో

ఓబులవారిపల్లె: మండలంలోని జడ్పీ హైస్కూల్లో విద్యార్థులతో కలిసి నియోజకవర్గం ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా వల్ల మానసిక ప్రశాంతత వస్తుందని తద్వారా ఆరోగ్యవంతులుగా అవుతారని దీనికి కోసం ప్రత్యేక సమయం కేటాయించాలని హైస్కూల్ సిబ్బందిని కోరుతున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసేందుకు డైనింగ్ హాలును నిర్మించాలని కోరగా, తమ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. అందుకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రెడ్డయ్య, హెడ్మాస్టర్ రమణయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూయ, ఎస్.రఘునాథ్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, పున్నాటి వాసుదేవ రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సుబ్బరాయుడు ఆచారి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం :సిద్దవటం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఫిజికల్ డైరెక్టర్ రెడ్డమ్మ మాట్లాడుతూ యోగాతో లభించే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్య ప్రయోజనాలను ప్రోత్సహించడానికి జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగా అంటే కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదని, శ్వాస, వ్యాయామాలు ఉంటాయని, ఒత్తిడి, ఆందోళన నిరాశను తగ్గించడానికి సహాయ పడుతుందని తెలిపారు. యోగాలో ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ ధ్యాన, సమాధి తదితర అష్టాంగ నియమాలు ఉన్నాయని, యోగ సాధన ద్వారా అనేక మానసిక శారీరక రుగ్మతలు నశిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిట్వేలి : స్థానిక కెకె వడ్డిపల్లె కాలనీఅంగన్వాడీ కేంద్రంలో చిట్వేలి ప్రాజెక్టు సీడీపీవో రాజేశ్వరి , నాగవరంలో గ్రేడ్- 1 సూపర్‌వైజర్ వసుంధరమ్మ, మార్లోపల్లెలో గ్రేడ్-2 సూపర్‌వైజర్ సురేఖారాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్‌లు, పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నందలూరు: నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద విస్డం ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ వలిమి రాధా ఆధ్వర్యంలో యోగా గురువు అనిల్ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. సీనియర్ రైల్వే మెడికల్ ఆఫీసర్ బచ్చు జయబాస్కర్‌రావు, ఎస్‌ఐ అబ్దుల్ మహ్మద్ జహీర్, ఎస్‌ఐ రామ్మోహన్, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు కుర్రా మణియాదవ్, సుధాకర్ పాల్గొన్నారు. అన్నమాచార్య పాఠశాలలో కరస్పాండెంట్ శివప్రసాద్, అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్, మాజీ జడ్పీటీసీ యల్లటూరు శివరామరాజు, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు షబ్బీర్ అహ్మద్, బీజేపీ రాజంపేట అసెంబ్లీ కోకన్వీనర్ డాక్టర్ హరిప్రసాద్, బాలాంజనేయులు పాల్గొన్నారు. మండల ప్రభుత్వ వైద్యాధికారి శరత్‌కమల్ ఆధ్వర్యంలో సీహెచ్‌వో వెంకటనారాయణ,


చిన్నమండెం: యోగా డే అక్షరాల రూపంలో కూర్చుని యోగా చేస్తున్న విద్యార్థులు

ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌సి ఆరిఫ్ పాల్గొన్నారు. విభా ఏరు డైట్ స్కూలోపాఠశాల చైర్మన్ డాక్టర్ బచ్చు జయభాస్కర్ , డాక్టర్ దీప్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఫిజికల్ డైరెక్టర్ గణేష్‌బాబు, ఉపాధ్యాయులు మోహన్‌రాజు, మస్తానయ్య, రమేష్‌బాబు, చాన్‌బాషా, లక్ష్మీనారాయణరెడ్డి, లక్ష్మీదేవి, శశికళ విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్లంపేట: ఎస్‌టీవీడీ సభ జూనియర్ కళాశాలలో ఎంఈవోలు చక్రధర్‌రాజు, నారా తిరుమలరావు, ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపీల్ లీలాశ్రీహరి, పీడీ నీలకంతరావు యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఎస్‌ఐ రఘురాం, ప్రిన్సిపాల్ బాలాజీరాజు, యోగా మాస్టర్ చంద్రకుమార్, ఎన్‌డీఏ నాయకులు కంబాల శ్రీనివాసులు, రాంప్రసాద్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేట బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో యోగా నిర్వహించారు. బీజేపీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఆదినారాయణ పట్టణ ప్రధాన కార్యదర్శి రమణ, నాగరాజు, ప్రవీణ్ కుమార్, నవీన్‌కుమార్, సురేష్, వేణుగోపాలచారి, తదితరులు పాల్గొన్నారు. అన్నమాచార్య యూనివర్శిటీలో ప్రిన్సిపాల్ ఎస్‌ఎంవి నారాయణ, ఫార్మసీ వైస్ ప్రిన్సిపాల్ ద్వారకానాథ్‌రెడ్డి, యోగా ఇన్‌స్పెక్టర్ లక్ష్మీరాజు ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ ఎల్.ఓబులపతి, ప్రదీప్‌కుమార్, జయశంకర్, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్‌వి రమణరాజు , ఆంజనేయులునాయుడు, రామచంద్రనాయుడు, ఎంఈవోలు చక్రధర్‌రాజు, రఘునాథ్‌రాజు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు సుధాకర్‌రాజు, మల్లికార్జున, అధ్యాపకులు చంద్రమోహన్, రామాంజనేయులు, మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఓబులవారిపల్లె: యోగా చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులతో ముక్కా వరలక్ష్మి


నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద యోగా చేస్తున్న విద్యార్థులు


రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల యోగాసనాలు


పుల్లంపేట: ఆదర్శ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

'హత్య చేస్తే తప్ప అరెస్టు చేయరా?'

రాయచోటి టౌన్, జూన్ 21: గిరిజన బిడ్డలు మరణిస్తే తప్ప దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయరా అని ఏపీ గిరిజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కేవిశ్వనాథ నాయక్ అన్నమయ్య జిల్లా పోలీసులను ప్రశ్నించారు. శుక్రవారం ఆయన రాయచోటిలోని సీపీఐ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పెద్దమండ్యం మండలం వడ్డేవంక తాండాలో ఈ నెల 13న బుక్కే రవీంద్ర నాయక్‌ను హత్య చేయడానికి యత్నించిన వారిని ఇంతవరకు ఎందుకు అరెస్టు చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు పనులు అడ్డుకున్న టీడీపీ నేతలు

సంబేపల్లె జూన్ 21: మంత్రి అనుమతి లేకుండా పనులు ఎలా చేస్తారంటూ టీడీపీ నాయకులు శుక్రవారం బీటీ రోడ్డు పనులను అడ్డుకున్నారు. మాజీ సర్పంచు నాగేశ్వరనాయుడు, యువగళం నాయకులు మండిపల్లె సిద్దారెడ్డి, స్థానిక నాయకులు బయారెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాగార్జున నాయుడు, బాబురెడ్డి, సీకే రోడ్డు నుంచి చిన్న బిడికి వరకు వేస్తున్న బీటీ రోడ్డు పనులను నిలిపివేసి, అక్కడ ఉన్న ఎక్స్‌కవేటర్ ను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద ఈ పనులకు ప్రభుత్వం రూ. 1.87 కోట్లు మంజూరు చేసి, సంబంధిత కాంట్రాక్టును బయోజయిన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు అప్ప గించారు. ఈ పనులకు సంబంధించి గత 8న శిలా ఫలకం వేశారు. ఎన్నిల కోడ్ అమలులోకి రావడం తో పనులు నిలిపి వేశారు.


పోలీస్ స్టేషన్ వద్ద ఎక్స్‌కవేటర్

ప్రస్తుతం కాంట్రాక్టర్ ఆ పనులు ప్రారం భించిన విషయం మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పనులు నిలిపివేయాలని సూచించారు. ప్రొటోకాల్ లేకుండా పనులు ప్రారం భించారని పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సంబంధిత అధికారి సందీప్‌ను వివరణ కోరగా మంత్రి జిల్లాకు రాగానే చర్చించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు


మరుగుదొడ్లు లేక భక్తుల ఇక్కట్లు

ఒంటిమిట్ట, జూన్ 21 : భక్తుల సౌకర్యా ర్థం కోదండరామాలయం వద్ద ఏర్పాటు చేసిన మరుగు దొడ్లలో నీరు రాకపోవడం తో నాలుగు రోజులుగా మూత పడ్డాయి. దీంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నా రు. కోదండ రామాలయం వద్ద 4 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి.. నాలు గు రోజులుగా నీరు రాకపోవడంతో అవి కూడా మూత పడ్డాయి. ఈ విషయంపై భక్తులు టీటీడీ అధి కారులకు ఫిర్యాదు చేసినా మరమ్మతులు చేయకపోవడంపై పలు విమర్శలు వినప డుతున్నాయి. ఇప్పటికైనా మరుగు దొడ్లలో నీరు వచ్చే విధంగా చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.


మూతపడిన మరుగుదొడ్లు

శాకంబరిగా పర్వతవర్ధినిదేవి

పుల్లంపేట, జూన్ 21: పుల్లంపేటలోని పర్వతవర్ధిని దేవి శాంతిలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు శాకంబరి అవతారంలో భక్తు లకు దర్శన మిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూజారి శ్రీకాంత్ స్వామి అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు. సాయంత్రం శివపార్వతులు నందివాహనంపై ఊరేగారు.



కనకదుర్గమ్మ సన్నిధిలో అరవ శ్రీధర్


అమ్మవారి దర్శనం అనంతరం బయటకు వస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా కుటుంబ సభ్యులు

ఓబులవారిపల్లె : ప్రమాణ స్వీకారం అనంతరం విజయ వాడలోని కనకదుర్గమ్మ గుడి కి వెళ్లి దర్శనం చేసుకున్నట్లు అరవ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కూటమి నేతలు, నియోజకవర్గ పెద్దల సహకా రంతో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలి పారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, కుమా రులు సాయివిశాల్‌రెడ్డి, సాయి వికాస్‌రెడ్డి, అరవ శ్రీధర్, అరవ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పురందేశ్వరిని కలసిన కోడూరు బీజేపీ నేతలు

రైల్వేకోడూరు, జూన్ 21: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరితో కోడూరు బీజేపీ నాయకులు వాకచర్ల సుబ్బారావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. సురేష్‌రాజు శుక్ర వారం విజయవాడలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. అలాగే రాజంపేటలో అన్నమయ్య స్వస్థలం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విన్నవించామన్నారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని తెలిపా మన్నారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించారన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ, ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేపీ క్రమ శిక్షణ సంఘం చైర్మన్ పాన సత్యనారాయణ తదితరులను కలసినట్లు తెలిపారు.


పురందేశ్వరితో కోడూరు, రాజంపేట నేతలు


వీరాంజనేయ స్వామి ఆలయంలో సుగవాసి పూజలు

సుండుపల్లె జూన్ 21; అన్నదానం మహా పుణ్యకార్యమని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి సుగవాసి బాల సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం తిమ్మ సముద్రం వీరాంజనేయ ఆలయంలో ఆయన పూజలు చేశారు. తిరుణాల సందర్భంగా టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల క్లస్టర్ ఇన్చార్జీ శివకుమార్ నాయుడు, దామోదర్‌నాయుడు, మోహన్ బాబు నాయుడు, మాలేపాటి సురేష్‌నాయుడు, మస్తాన్ బాబు, ప్రతాప్‌రెడ్డి, వెంకటరమణ, టిట్టెం రామచంద్ర, నాగసుబ్బయ్య, ఈసూబ్, కిరణ్‌కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు


అన్నదాన కార్యక్రమానికి హజరైన బాలసుబ్రమణ్యం

హనుమద్వాహనంపై వేణుగోపాలుడు

పెనగలూరు, జూన్ 21: వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ భాగవతారిణి నర్తనశాల హరికథ వినిపించారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేతంగా వేణుగోపాలుడు హనుమద్వా హనంపై పుర వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యకర్త చెంచు సుబ్బనరసయ్యస్వామి, ఆలయ పూజారి చంద్ర శేఖర్‌శర్మ, సాయికుమార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా, శనివారం సాయంత్రం దేవాలయ ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత వేణుగోపాలుని కళ్యాణోత్సవం జరుగుతుందని దేవాలయ ప్రధాన కార్యకర్త చెంచు సుబ్బనరసయ్యస్వామి తెలిపారు. ఈ కళ్యాణోత్సవాన్ని గ్రామంలోని గౌనేని కృష్ణయ్యనాయుడు కుటుంబ సభ్యులు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.


గ్రామోత్సవంలో వేణుగోపాలుడు

విద్యార్థులకు నగదు పురస్కారం

పెనగలూరు, జూన్ 21 : పదో తరగతి పరీక్షల్లో ఇంగ్లీష్, తెలుగు సబ్జెక్టుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణిలో మార్కులు సాధించిన విద్యార్థులకు పోలిన మునెమ్మ ట్రస్టు సభ్యుడు రామాంజనేయులు నగదు బహుమతులను అందజేశారు. హెడ్మాస్టర్ గోపాలకృష్ణ అధ్యక్షతన ఇంగ్లీష్ సబ్జెక్టులో ప్రథమ స్థానం సాధించిన లక్ష్మీకళకు 5,200 రూపాయలు, విష్ణువర్దన్‌రెడ్డికి 3,200 రూపాయలు, దీక్షితకు 1200 రూపాయలు,తెలుగులో కవితకు 5,200, శివకృష్ణకు 3200, ఆశాబీకి 1200 రూపాయల నగదుతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు, విశ్రాంత ప్రొఫెసర్లు సుబ్రమణ్యం, రామచంద్రయ్య విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే ప్రతి తరగతిలోను అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఈ సమావేశంలో పాఠశాలల ఉపాధ్యాయులు అన్వర్‌బాషా, సుదర్శన్, మహేంద్రప్రసాద్, శివ నరసింహులు, హరిప్రసాద్, ప్రమీల, శ్రీవాణి, కృష్ణకుమారి, పరిమళ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాలకు హాని చేయడం తగదు

ఓబులవారిపల్లె, జూన్ 21 : భారత రాజ్యాంగ నిర్మాత మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు హాని చేయడం మంచి పద్ధతి కాదంటూ మండలంలోని పత్రికా విలేకరులు, చిన్నఓరంపాడు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహాలు ధ్వంసం చేయడం, హాని చేయడం మంచి పద్ధతి కాదని, తద్వారా కులాల మధ్య గొడవలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నయ్య, చంద్రశేఖర్, హరినాథ్ , చిన్నఓరంపాడు సర్పంచ్ గద్దె సిద్దమ్మ, కుమారుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించండి

వీరబల్లి జూన్21; బ్యాంక్‌ల నుంచి పొందిన రుణాలు సకాలంలో చెల్లించి కొత్తరుణాలు పొందాలని స్త్రీనిధి ఏజీఎం ఉదయ్‌కిరణ్ కోరారు. శుక్రవారం సానిపాయి సచివాలయంలో గ్రామ సమాఖ్య జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ రెండేళ్లుగా స్త్రీనిధి రుణాలు బకాయిలు ఉండడంతో కొత్త రుణాలు నిలిపి వేశారని ఈ నెల ఆఖరి లోపు తీసుకున్న స్త్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించి కొత్త రుణాలు పొందాలన్నారు. కోఆర్డినేటర్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ డ్వాక్రా రుణాలకు ప్రభుత్వం రూ. 10 లక్షల వరకు వడ్డీ రాయితీ కల్పిస్తోంది అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు నేతి ఆంజనేయులు, ఏపీఎం ఖాదర్‌వలి, స్త్రీనిధి మేనేజర్ హరీష్, సిసిలు కృష్ణయ్య, వెంకటలక్ష్మి, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

వైభవంగా భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

చిట్వేలి, జూన్ 21: మండల పరిధిలోని కేఎస్ అగ్రహారంలో భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం మోహిని తిరుక్కోలం, రాత్రి గరుడు సేవ నిర్వహించారు. ఉభయదాతలో స్వామివారి సేవలో పాల్గొన్ని పూజలు నిర్వహించారు. ముందుగా సాయంత్రం ఉత్సవ మూర్తులను అగ్రహారం నుండి చిట్వేలి వరకు గ్రామోత్సం నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మండల నలుమూలల నుంచి బ్రహ్మోత్సవాల్లో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించు కుని మొక్కులు తీర్చుకున్నారు. ఈనెల 26 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు కార్య నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెట్లూరు శేఖర్, నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎల్లమ్మ జాతర

సుండుపల్లె, జూన్ 21: మండల కేంద్రానికి సమీపంలోని చెన్నంశెట్టిపల్లెలో శనివారం నుంచి ఎల్లమ్మ జాతర ప్రారంభమవుతుందని స్థానికులు తెలిపారు. శనివారం ఉదయం గణపతి పూజ, అంకురార్పణ, మంగళ హారతి, ఆదివారం అమ్మవారికి మంగళ ద్రవ్యాలతో అభిషేకం, పట్టు బంగారం తెచ్చుట, పొంగుబాలు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అలాగే సోమవారం, పూజలు అన్నదానంతో పాటు ఎల్లమ్మ గ్రామోత్సవం ఉంటుందన్నారు.

హోం మంత్రి అనితకు సత్కారం


రాజంపేట, జూన్ 21 : హోంమంత్రి వంగలపూడి అనితను రాజంపేట టీడీపీ నాయకుడు, పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ విజయవాడలో కలిసి శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది సూర్యచైతన్య తదితరులు పాల్గొన్నారు.

కీలక స్థానాల్లో ...

ఉమ్మడి చిత్తూరు జిల్లా పూర్వ అధికారులకు రాష్ట్రప్రభుత్వంలో మంచి పోస్టింగులు

సీఎస్‌గా నీరబ్... సీఎం కార్యదర్శులుగా రవిచంద్ర, ప్రద్యుమ్న

పలువురు ఇతర అధికారులకు కీలక శాఖల బాధ్యత



తిరుపతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో పనిచేసిన అనేకమంది ఐఏఎస్ అధికారులు ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వంలో కీలక స్థానాల్లో నియమితులయ్యారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నీరబ్ కుమార్ ప్రసాద్ 1998లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు 72వ కలెక్టర్‌గా పనిచేశారు. 2008-09 నడుమ జిల్లాకు 78వ కలెక్టర్‌గా వ్యవహరించిన ముద్దాడ రవిచంద్ర ఇపుడు సీఎం చంద్రబాబుకు ముఖ్య కార్యదర్శిగా నియమితులయ్యారు. అలాగే 2017-19 నడుమ జిల్లాకు 83వ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన పి.ఎస్.ప్రద్యుమ్న సీఎం చంద్రబాబుకు కార్యదర్శిగా పోస్టింగ్ పొందారు. ప్రద్యుమ్న ఈ కీలక బాధ్యతలకు తోడు యువజన సర్వీసులు, క్రీడలు, సాంస్కృతిక, పర్యాటక శాఖల ముఖ్యకార్యదర్శిగా అదనపు బాధ్యతలు కూడా స్వీకరించారు. గతంలో ఉమ్మడి జిల్లా డ్వామా పీడీగానూ, తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గానూ పనిచేసిన ఎం.జానకి, అలాగే ఉమ్మడి జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గానూ, తిరుపతి కమిషనర్‌గానూ పనిచేసిన వాడరేవు వినయ్ చంద్ ఆర్థిక శాఖ కార్యదర్శులుగా నియమితులయ్యారు. 2004లో జిల్లాకు 75వ కలెక్టర్‌గా పనిచేసిన జి.సాయిప్రసాద్ తాజాగా రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2014-17 మధ్య జిల్లాకు 82వ కలెక్టర్‌గా పనిచేసిన సిద్ధార్థ జైన్ ఇపుడు పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా పోస్టింగ్ అందుకున్నారు. గతంలో మదనపల్లె సబ్ కలెక్టర్‌గా పనిచేసిన అహ్మద్ బాబు ప్రస్తుతం ఉద్యాన, ఆక్వాకల్చర్, మత్స్య శాఖల కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇక టీటీడీ ఈవోగా పనిచేసిన అనిల్ కుమార్ సింఘాల్ ఇపుడు మున్సిపల్ పాలనా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఇప్పటి వరకూ తిరుపతి కలెక్టర్‌గా పనిచేసిన ప్రవీణ్ కుమార్ బదిలీపై గనులు, భూగర్భ శాఖ కమిషనర్ మరియు డైరెక్టర్ గానూ, ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ గానూ నియమితులయ్యారు. ఈ నియామకాలతో రాష్ట్రంలో జిల్లా ప్రతిష్ఠ ఇనుమడించడంతో పాటు ఆ మేరకు ప్రాధాన్యత కూడా పెరిగింది.

ప్రద్యుమ్నకు తగిన గుర్తింపు



గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు జేసీగానూ, కలెక్టర్‌గానూ పనిచేసిన పి.ఎస్.ప్రద్యుమ్నకు ఎట్టకేలకు తగిన గుర్తింపు లభించింది. జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగితే ఆయన రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. అప్పట్లో ఓట్ల లెక్కింపులో అధికార కాంగ్రెస్ పార్టీ తరపున ప్రభుత్వ పెద్దల నుంచీ తీవ్రస్థాయి ఒత్తిళ్లు వచ్చినా ఆయన వెరవకుండా నిజాయితీగా వ్యవహరించడంతో వైసీపీ మద్దతుతో పోటీ చేసిన డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి ఒక్క ఓటు తేడాతో గెలుపొందారు. ప్రభుత్వ పెద్దల మాట ఖాతరు చేయకపోవడంతో ఎన్నికలు ముగిసిన వెంటనే ఆయనను రైతు బజార్ల సీఈవోగా ప్రాధాన్యత లేని పోస్టుకు ప్రభుత్వం బదిలీ చేసింది. అయితే 2014లో టీడీపీ ప్రభుత్వం రావడంతో ఆయన సమర్థతను, నిజాయితీని గుర్తించిన నాటి సీఎం చంద్రబాబు ఏరికోరి సొంత జిల్లాకు కలెక్టర్‌గా నియమించారు. పని చేసింది రెండేళ్ళే అయినా జిల్లాను అనేక అంశాల్లో జాతీయస్థాయిలో ఉత్తమంగా నిలిపారు. 2018లో 2.77 లక్షల మరుగుదొడ్లు నిర్మించి బహిరంగ మల విసర్జన జరగని తొలి జిల్లాగా దేశంలోనే మొదటి స్థానంలో నిలిపారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులకు కూడా ఎక్కారు.అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్, తాగునీరు, టాయిలెట్ సదుపాయాలు కల్పించడంతో పాటు ఫర్నిచర్, టీవీ వంటివి సమకూర్చారు.పల్లె నిద్ర పేరిట ఒకే రోజు జిల్లావ్యాప్తంగా 2 వేల మంది ఉద్యోగులు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి అవసరమైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకున్నారు.మహిళా వర్సిటీతో ఒప్పందం కుదుర్చుకుని యశోద కార్యక్రమం పేరిట అంగన్వాడీ వర్కర్లకు మెరుగైన శిక్షణ ఇప్పించారు. బంగారుపాలెం నుంచీ నాయుడుపేట వరకూ ఇపుడున్న సిక్స్ లేన్ రోడ్డును ప్రతిపాదించింది ఆయనే.ది బెటర్ ఇండియా సంస్థ 2018లో ఎక్కువ మంది ప్రజల జీవన పరిస్థితులను ప్రభావితం చేసిన పదిమంది స్ఫూర్తిదాయక ఐఏఎస్ అధికారులను గుర్తించగా వారిలో ప్రద్యుమ్న 7వ స్థానం దక్కించుకున్నారు.ఇలాంటి అధికారికి 2019 తర్వాత తగిన గుర్తింపు లేకుండా పోయింది.ప్రాధాన్యత లేని శాఖలు కేటాయించారు. ఇటీవలి ఎన్నికల్లో గెలిచి చంద్రబాబు సీఎం కావడంతో ప్రద్యుమ్న సేవలను తగిన విధంగా వినియోగించుకునేందుకు ఆయన ఏకంగా తన కార్యదర్శిగా నియమించుకోవడం విశేషం.

ఎర బుట్టలతో మామిడిని కాపాడుకోండి

చిత్తూరు (సెంట్రల్), జూన్ 21: ఎర బుట్టలతో ఈగల నుంచి మామిడి పంటను కాపాడుకోవచ్చునని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదనరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తోతాపురి, నీలం కాయలు ఇంకా చెట్లపై ఉన్న క్రమంలో ఈగలు ఆశించే వీలుందని, తద్వారా పంట దిగుబడి తగ్గిపోతుందని పేర్కొన్నారు. ఎర బుట్టలు ఏర్పాటు చేయడం ద్వారా ఈగ తెగులు నుంచి పంటను కాపాడుకోవచ్చునని తెలిపారు. ఎకరాకు 8 బుట్టలు సరిపోతాయని, రూ.210 చెల్లించి చిత్తూరు ఉద్యాన శాఖ అధికారి నుంచి పొందవచ్చునని వివరించారు.

కాయలు ఫ్యాక్టరీలకు తరలిస్తే లాభసాటి : రైతులు తోతాపురిని ర్యాంపుల వద్ద కాకుండా నేరుగా ఫ్యాక్టరీలకు తరలించడం ద్వారా టన్నుపై రూ.1,500 అదనంగా పొందవచ్చునని చిత్తూరు ఉద్యాన అధికారి వింధ్య తెలిపారు. ర్యాంపుల్లో కాయలు విక్రయించడం ద్వారా గిట్టుబాటు ధర రావడం లేదని పేర్కొన్నారు. ఎర బుట్టల కోసం 79950 86961లో సంప్రదించాలని కోరారు.

బిందు సేద్యంతోనే అధిక దిగుబడులు

ఏపీఎంఐపీ జిల్లా పీడీ బాలసుబ్రమణ్యం



బిందు సేద్యం పరికరాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న పీడీ బాలసుబ్రమణ్యం

శాంతిపురం, జూన్ 21: బిందు సేద్యం పరికరాల వినియోగంతో ఎక్కువ విస్తీర్ణంలో తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రమణ్యం రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కెనమాకులపల్లె పంచాయతీ గడ్డూరు గ్రామం వద్ద శ్రీనివాసులురెడ్డి రైతు పొలంలో అమర్చిన బిందు సేద్యం పరికరాలను ఆయన పరిశీలించారు. వాటి ద్వారా సేద్యం ఎలా చేయాలో రైతులకు అవగాహన కల్పించారు. మట్టిలో పూడిన డ్రిప్ పైపులను ఆమ్లా చికిత్స ద్వారా ఎలా బాగు చేయాలో తెలియజేశారు. స్క్రీన్ ఫిల్టర్, హైడ్రోసైక్లోన్ ఫిల్టర్లను శుభ్రం చేసిన తరువాత నీటిలో కరిగే ఎరువులను ప్రెషర్ గేజ్‌లో 1-2 పాయింట్ల మధ్యలో ఉంచాలన్నారు. అప్పుడు ఎరువులను డ్రిప్‌ల ద్వారా పంపే సమయంలో 1.5 - 2 పాయింట్ల మధ్యలో ప్రెషర్‌లో ఉంచాల న్నారు. అలా చేయడం వల్ల మొక్కకు కావలసినంత ఎరువు చేరుతుందన్నారు. అలాగే పరికరాలు మరమ్మతులకు గురికాకుండా ఉంటాయన్నారు. అలా చేయ కుండా ఎలా పడితే అలా డ్రిప్‌ల ద్వారా మందులు, ఎరువులు వదిలేయడంతో డ్రిప్ పైపులు, ఇతర పరికరాలు దెబ్బతింటాయని తెలియజేశారు. అనంతరం రైతులు బిందు సేద్యం పరికరాలు సబ్సిడీపై కావాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ త్వరలోనే అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఏవో సాయి శ్రీనివాస్, ఫినోలెక్స్, నాగార్జున కంపెనీల ప్రతినిధులు, ఇతర రైతులు పాల్గొన్నారు.

పంటలపై కొనసాగుతున్న ఏనుగుల దాడులు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడి చెట్టు

కల్లూరు, జూన్ 21: పులిచెర్ల మండలం పాళెం పంచాయతీలో మూడు రోజులుగా తిష్టవేసిన ఏనుగులు గుంపు వ్యవసాయ పంటలపై దాడులు కొనసాగుతున్నాయి. దీంతో మామిడి, అరటి, టమోటా, వరి తదితర పంటలకు నష్టం కలిగిస్తున్నాయి. కోటపల్లి సమీపంలో గురువారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో మామిడిపంటకు అపార నష్టం వాటిల్లింది. కోటపల్లికి చెందిన హంసవేణి మామిడితోటలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు 12 మామిడిచెట్లను విరిచేశాయి. సుమారు టన్ను మామిడికాయలను నేలరాల్చాయి. డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి. అదే గ్రామానికి చెందిన సురేంద్రరాజు, దాము తదితర రైతుల మామిడి చెట్లను విరిచేశాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతలు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ కమిటీలన్నీ రద్దు

వెదురుకుప్పం, జూన్ 21: కాంగ్రెస్ పార్టీలో ఉన్న అన్ని కమిటీలను ఈనెల 20వ తేదీ నుంచి పూర్తిగా రద్దు చేసినట్లు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. త్వరలోనే నూతన కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని వెదురుకుప్పంలో శుక్రవారం డీసీసీ తాజా మాజీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ ధ్రువీకరించారు.

ఎస్జీబీకి జాతీయ అవార్డు



జ్ఞాపిక స్వీకరిస్తున్న ఎస్జీబీ చైర్మన్ ప్రసాద్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 21: సామాజిక భద్రత పథకం అమలులో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న సప్తగిరి గ్రామీణ బ్యాంకు జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక అవార్డు కైవసం చేసుకుంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంతో వరుసగా రెండో ఏడాది అవార్డు దక్కించుకుంది. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఎస్జీబీ చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ డీఎఫ్ఎస్ కార్యదర్శి వివేక్ జోషి చేతులమీదుగా అటల్ పెన్షన్ యోజన వార్షిక అవార్డును అందుకున్నారు. ఈ ఏడాది అల్టిమేట్ చాంపియన్‌షిప్ కప్‌ను కూడా ఆయన స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో ఎస్జీబీ ముందంజలో ఉందని పేర్కొన్నారు.

అయినా.. మారలేదు



నవరత్నాలు పేరు గల ధ్రువపత్రాలు

తవణంపల్లె, జూన్ 21: సచివాలయాల్లో జారీ చేసే సర్టిఫికెట్లలో ప్రభుత్వ ముద్ర మాత్రమే ఉండాలని కొత్త ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయినా, తవణంపల్లె మండలం అరగొండ సచివాలయంలో శుక్రవారం కూడా రైతులకు ఇచ్చిన వన్‌బీ అడంగళ్ సర్టిఫికెట్‌పై గత ప్రభుత్వ నవరత్నాలు లోగో ఉంది. ఇతర సర్టిఫికెట్లలోనూ మాజీ సీఎం జగన్ ఫొటో ఉన్నట్లు ఆరోపణలున్నాయి. వీటిపై తీవ్ర విమర్శలు తలెత్తాయి. ఇక్కడి ఆర్బీకేకు వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రం పేరును అలాగే ఉంచడంపైనా ఆరోపణలు వస్తున్నాయి.


గరుడుడిపై లోకమాత సాక్షాత్కారం

● ముగిసిన అమ్మవారి తెప్పోత్సవాలు



గరుడ వాహనంపై అమ్మవారు

తిరుచానూరు, జూన్ 21: తిరుచానూరు పద్మావతిదేవి తెప్పోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. సుప్రభాత మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవ మూర్తిని పద్మసరోవరంలోని నీరాడమండపానికి వేంచేపుచేసి స్నపనతిరుమంజనం నిర్వహించారు. అనంతరం అలంకార శోభితురాలైన అమ్మవారిని తెప్పపై కొలువుదీర్చి పద్మసరోవరంలో ఏడు పర్యాయాలు విహరింపజేశారు. రాత్రి అమ్మవారు గరుడ వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగారు. దీంతో తెప్పోత్సవాలు ముగిశాయి. అమ్మవారి ఆలయంలో శనివారంనుంచి ఆర్జిత సేవలు యథావిధిగా కొనసాగుతాయని టీటీడీ అధికారులు తెలిపారు.





పుష్కరిణిలో విహరిస్తున్న పద్మావతిదేవి

జీడీనెల్లూరు సీఐకి ఏడాది జైలు

● రూ.పది వేల జరిమానా విధించిన నందికొట్కూరు కోర్టు

● ఎస్ఐగా ఉన్నప్పుడు దాడి ఘటనపై బాధితుడి ప్రైవేటు కేసులో సంచలన తీర్పు



సీఐ శంకర్

గంగాధరనెల్లూరు, జూన్ 21: తనపై ఎస్ఐ శంకర్ దాడి చేశారంటూ బాధితుడు వేసిన ప్రైవేటు కేసులో కర్నూలు జిల్లా నందికొట్కూరు కోర్టు సంచలన తీర్పునిచ్చింది. ఏడాది జైలు శిక్ష, రూ.పది వేల జరిమానా విధించింది. 11 ఏళ్ల కిందటి ఘటనపై గురువారం తీర్పు వెలువరించింది. నాటి ముచ్చుమర్రి ఎస్ఐ శంకర్ (గానాల మారుతీ శంకర్).. ఇప్పుడు గంగాధరనెల్లూరు సీఐగా పనిచేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా పగిడ్యాల మండలం ఘణపురానికి చెందిన తండ్రీ కొడుకులు నాగిరెడ్డి, నరేంద్రరెడ్డికి మధ్య ఆస్తి విషయమై 2013లో తగాదా జరిగింది. ఆస్తి విషయమై తన కుమారుడు దాడి చేశాడంటూ నాగిరెడ్డి ముచ్చుమర్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ శంకర్ అలియాస్ గానాల మారుతీ శంకర్ నరేంద్రరెడ్డిని స్టేషన్‌కు పిలిపించగా విచారణకు సహకరించలేదనే కారణంతో కొట్టారు. తనను ఎస్ఐ కొట్టారంటూ అప్పట్లో బాధితుడైన నరేంద్రరెడ్డి సీఐ, డీఎస్పీ, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా.. అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఎస్ఐ శంకర్‌పై అప్పట్లోనే బాధితుడు ప్రైవేటు కేసు వేశారు. ప్రస్తుతం నందికొట్కూరు జూనియర్ సివిల్‌కోర్టులో విచారణ జరిగింది. ఆ కేసుకు సంబంధించి అప్పటి ఎస్ఐ.. ఇప్పుడు గంగాధరనెల్లూరుగా సీఐగా పనిచేస్తున్న శంకర్‌కు ఏడాది జైలుశిక్షను విధిస్తూ జడ్జి దివ్య గురవాఆరం తీర్పునిచ్చారు. దాంతో పాటు రూ.10వేల జరిమానా కూడా విధించారు. కోర్టు తీర్పు ఉత్తర్వులు జిల్లా ఎస్పీతో పాటు గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్‌కు చేరినట్లు సమాచారం. దీనిపై వివరణకు సీఐని సంప్రదించడానికి ప్రయత్నించగా.. ఫోను స్విచ్ ఆఫ్‌లో ఉంది.

సదుం ఎంపీపీ మృతి



ఎల్లప్ప (ఫైల్ ఫొటో)

సదుం, జూన్ 21: సదుం ఎంపీపీ ఎల్లప్ప(70) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. నడిగడ్డ పంచాయతీ చిచ్చిలివారిపల్లెలోని తన స్వగృహంలో శుక్రవారం వేకువజామున గుండెపోటుకు గురయ్యారు. కుటుంబసభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వైసీపీలో క్రియాశీలకంగా ఉన్నారాయన. విజయవాడలో ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం అయిన వెంటనే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సదుంకు చేరుకుని ఎల్లప్ప మృతదేహానికి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబీకులను పరామర్శించారు. చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప, జడ్పీటీసీ సోమశేఖర రెడ్డి, వైసీపీ నేతలు పెద్దిరెడ్డి, ఇందిరమ్మ, వేణుగోపాల్ రెడ్డి, సుధీర్‌రెడ్డి, మండల పరిషత్ సిబ్బంది, పలువురు ఉద్యోగులు ఎల్లప్ప మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సంతాపం తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

వెంకటాపురంలో అతిసారం

ఆస్పత్రికి పరుగులు తీసిన బాధితులు ● గ్రామంలో వైద్య శిబిరం



గుడుపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటాపురం గ్రామస్థులు

గుడుపల్లె, జూన్ 21: గుడుపల్లె మండలం వెంకటాపురం గ్రామంలో అతిసారంతో పలువురు అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం గ్రామంలో కొందరికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. మధ్యాహ్నం తర్వాత మరికొందరు అస్వస్థతకు గురయ్యారు. దీంతో భయపడిన బాధితులు తులసమ్మ(40), రమేష్(43), కొందురు కుప్పం ప్రైవేటు ఆసుపత్రిలో రాహుల్ రాయ్(6), గీతాంజలీ(8), చంద్రప్ప(45) కుప్పం ఏరియా ఆస్పత్రికి, రామక్రిష్టప్ప(62), రాజేశ్వరి(55), శ్యామల (28), సంజన(7) గుడుపల్లె పీహెచ్‌సీకి వెళ్లారు. దేవేంద్ర(21), వెంకటలక్ష్మీ(62), లక్ష్మమ్మ(42), వనజాక్షి(40), సందీప్(9) తదితరులు గ్రామంలో వైద్య శిబిరంలో చికిత్స చేసుకొన్నారు. అస్వస్థతకు గురైన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రానికల్లా ప్రమాదం లేదని వైద్యులు తెలపడంతో అందరూ తమ ఇళ్లకు చేరుకొన్నారు. వెంకటాపురం గ్రామంలో అతిసారం విషయం తెలిసిన వెంటనే గుడుపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డెల్ఫిన్ ఆధ్వర్యంలో వెంకటాపురం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. పంచాయతీ రాజ్ అధికారులు, సర్పంచ్ నారాయణ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేసి గ్రామస్థులకు పలు ఆరోగ్య జాగ్రత్తలను తెలిపారు. సర్పంచ్ త్రాగు నీటి ట్యాంకులకు క్లోరినేషన్ చేసారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుసూదన్, డీఈ పురుషోత్తం గ్రామంలోకి చేరుకొని నీటిని తీసుకొని పరీక్ష కోసం తిరుపతి ల్యాబ్‌కు పంపారు. ఆ తరువాత గ్రామంలో శుద్ధ నీటిని ట్యాంకర్ ద్వారా ప్రజలకు అందించారు.

ఫుడ్ పాయిజన్‌తో మరో 15 మందికి అస్వస్థత



చికిత్స పొందుతున్న బాధితులు

పాలసముద్రం, జూన్ 21: పాలసముద్రం గంగజాతరలో ఫుడ్ పాయిజనై 150 మంది అస్వస్థతకు గురైన విషయం విదితమే. శుక్రవారం కూడా 15 మంది పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందారు. వీరికి జ్వరం, విరేచనాలు అవుతుండడంతో వైద్యులు చికిత్సలు చేశారు. ఏపీడీ డాక్టర్ శ్రీవాణి నేతృత్వంలోని డాక్టర్ల బృందం శుక్రవారం కూడా గ్రామంలో పర్యటించారు. తాగునీరు కలుషితం కాలేదని, జాతర సందర్భంగా సమర్పించిన అంబలిలో పాయిజనింగ్ అయి ఉంటుందని తెలిపారు. ఆ అంబలి శాంపిల్‌ను తిరుపతి రుయాస్పత్రి ల్యాబ్‌కు పంపించామన్నారు. డాక్టర్ మోహనక్రిష్ణ, తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీడీవో రామనాథ రెడ్డి, సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్వైజర్ మురళి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధర్మారెడ్డిపై డీజీపీ, సీఐడీలకు ఫిర్యాదు

టీటీడీ పూర్వ ఈవో అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ కోరిన తిరుపతివాసి

తిరుపతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): టీటీడీ పూర్వ ఈవో, ప్రస్తుత అదనపు ఈవో ధర్మారెడ్డిపై డీజీపీ, సీఐడీ అదనపు డీజీపీలకు తిరుపతి శ్రీనివాసపురానికి చెందిన చెందిన ఎం.రామచంద్రనాయుడు ఫిర్యాదు చేశారు. ధర్మారెడ్డి ఉద్దేశపూర్వకంగా చేసిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.టీటీడీ ఈవోగా ఆయన పనిచేసిన కాలంలో భక్తుల నుంచీ వచ్చిన డబ్బును, ప్రోటోకాల్ పేరుతో దర్శనాలను దుర్వినియోగం చేశారని, వైసీపీకి అనుకూలంగా వ్యక్తులను, వ్యవస్థలను మేనేజ్ చేసి శ్రీవారి పవిత్రతకు భంగం కలిగించారని ఆరోపించారు. శ్రీవాణి ట్రస్టుకు సంబంధించిన డబ్బును దారి మళ్లించారన్నారు. సమరసత సేవా ఫౌండేషన్‌కు, టీటీడీకి నడుమ జరిగిన ఆర్థిక లావాదేవీలపై విచారణ జరపాలని కోరారు. ఇంజనీరింగ్ బడ్జెట్ ద్వారా అవసరం లేకున్నా కమీషన్ల కోసం వేల కోట్ల రూపాయలు మంచినీళ్ళప్రాయంగా ఖర్చు చేసి కొన్ని టెండర్ల రూపంలో, మరికొన్ని నామినేషన్ రూపంలో మంజూరు చేసిన పనులమీద, వాటి నాణ్యత మీద విచారణ చేపట్టాలని కోరారు. అత్యవసరం పేరిట శానిటేషన్, ఇతర పనులు నామినేషన్‌పై చేసిన పనులన్నింటిపై దర్యాప్తు చేయాలని అభ్యర్థించారు. లడ్డూ ప్రసాదాల కోసం, అన్న ప్రసాదాల కోసం నాణ్యత లేని సరుకులు కొనుగోలు చేయడంపైన, వాటి ధరలు, నాణ్యతపైన విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. ప్రోటోకాల్ లేని వారికి కేటాయించిన సేవా టికెట్లపై కూడా విచారణ జరపాలని కోరారు. వీఐపీ, వీవీఐపీ ప్రోటోకాల్‌లో వున్నవారిని, లేని వారిని కూడా శ్రీవారి సన్నిధిలో తరింపజేసి తద్వారా వైసీపీ అధినాయకులకు అనుకూలంగా పనులు చేయించిన దానిపై లోతుగా దర్యాప్తు జరపాలని కోరారు. తిరుమలలో ఎవరికీ లేని విధంగా విశాఖ స్వరూపానంద ఆశ్రమానికి భవన నిర్మాణానికి అనుమతులు జారీ చేయడంపైనా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని విభాగాలలో తనకు అనుకూలంగా వున్న వారిని సలహాదారులుగా నియమించుకోవడంపైన, వారికి చెల్లించిన జీతభత్యాలపైన సమగ్ర విచారణ జరపాలని తనను టీడీపీ రాష్ట్ర నాయకుడుగా పేర్కొంటూ ఎం.రామచంద్రనాయుడు లిఖిత పూర్వక ఫిర్యాదులు చేశారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం


యోగాసనాలు వేస్తున్న ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు


తంబళ్లపల్లెలో యోగాసనాలు వేస్తున్న న్యాయాధికారి, కోర్టు సిబ్బంది


కలకడలోని కోన హైస్కూల్‌లో విద్యార్థుల యోగాసనాలు

తంబళ్లపల్లె, జూన్ 21: యోగా సాధన ద్వారా ఆరోగ్యంతో పాటు ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తంబళ్లపల్లె సివిల్ కోర్టు న్యాయాధికారి ఉమర్‌ఫరూక్ అన్నారు. శుక్రవారం సివిల్ కోర్టుతో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టులో న్యాయాధికారి, కోర్టు సిబ్బందితో పాటు ఆయా పాఠశాలల్లో విద్యార్థులు యోగా సనాలు వేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. యోగాను ప్రతి ఒక్కరూ అలవాటుగా చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మదనపల్లె టౌన్/అర్బన్‌లో: యోగాతో శారీరక, మానసిక శాంతి లభిస్తుందని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో యోగాసనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ లింగారెడ్డి మాట్లాడుతూ రోజువారి జీవనంలో ఎంతో ఒత్తిడికి గురయ్యే వారికి యోగాసనాలు ఎంతో ఉపశమనం కల్గిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ సతీష్‌బాబు మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యసమస్యలు పరిష్కరించుకో వచ్చన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్‌రెడ్డి, అమరనాథరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొ న్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి యోగా ఫార్ హెల్త్ అండ్ సొసైటీ అని ప్రకటించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో యోగాగురువు నాగలక్ష్మి, సురేష్ అధ్యాపకులు శ్రీనివాసులు, గురుమూర్తి, ఖాజావలి, మోహనవల్లి, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల్లో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివపార్వతీదేవి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతకు యోగా చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రెడ్డెప్పరెడ్డి, అధ్యాపకులు మురళీధర్‌రెడ్డి, శ్రీదేవి, మాలతి, ఎంపీ నాయుడు, పీవీ రమణ పాల్గొన్నారు. అలాగే స్థానిక సొసైటీ కాలనీలోని విజయభారతి హైస్కూల్లో ప్రపంచ యోగా డేను నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నేత డాక్టర్ అజంతుల్లాఖాన్, కరాటే మబాస్టర్‌డాక్టర్ ఏఆర్ సురేష్, విజయభారతి వైస్ ప్రిన్సిపాల్ నిశ్చిత, యోగా మాస్టర్ దుర్గప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఫిజికల్ డైరె క్టర్ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: మానవ జీవన విధానంలో యోగా ఒక భాగమైపోయిందని ప్రభుత్వ కళాశాలు పిన్సిపాల్ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా కళాశాలలో విద్యార్థులచే యోగా కార్యక్రమాలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఉల్లాసంగా వుండాలంటే యోగా తప్పనిసరన్నారు. అలాగే స్థానిక జడ్పీహైస్కూల్ లో కూడా యోగా తరగతులు నిర్వ హించారు. ప్రధానోపాధ్యాయుడు అంజాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలకడలో: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కోన హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం చెంగల్‌రాయులు మాట్లాడుతూ విద్యార్థులు యోగా సనాలను శ్రద్ధగా నేర్చుకొనేందుకు ప్రతి రోజు సమయాన్ని కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: పెద్దతిప్పసముద్రం మండలంలోని కేజీబీవి పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మండల విద్యాశాఖాధికారి నారాయణ, పాఠశాల ఎస్‌వో శైలజలు విద్యార్థులతో కలసి ఘనంగా నిర్వహించారు ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులతో కలసి సూర్య నమస్కారాలు, యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఎంఈవో నారాయణ మాట్లాడుతూ ప్రాచీన భారతీయ సంప్రదాయాల నుంచి మనకు లభించిన ఓ అమూల్యమైన కానుక యోగా అన్నారు. పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాపై దృష్టి సారించి ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు.

పెద్దమండ్యంలో: ప్రతి ఒక్కరికి యోగాతో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని పెద్దమండ్యం ఎంఈవో మనోహర్, 2వ ఎంఈవో రామకృష్ణ పేర్కొన్నారు. పెద్దమండ్యం మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ యోగాతో ఏకాగ్రత లభిస్తుందన్నారు. మోడల్ స్కూల్ ప్సిన్సిపాల్ రామాంజనేయులు నాయక్, కలిచెర్ల కాలేజీ ఎన్ఎస్ఎస్ పీవో వెంకటనరసయ్య, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: ప్రతిరోజూ యోగా చేయడంవల్ల మానసికోల్లాసం, శారీరక ధృఢత్వం ఏర్పడుతుందని బి.కొత్తకోట మండల విద్యాశాఖాధికారి రెడ్డిశేఖర్, కస్తూరిబా విద్యాలయ ప్రిన్సిపాల్ ప్రేమలత లు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కస్తూరిబా, మోడల్‌స్కూల్ లతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఏపీ ఎంఎస్ ప్రిన్సిపాల్ శీనూనాయక్, పీఈటీలు పాల్గొన్నారు.

పీలేరులో: యోగా దినోత్సవం సందర్భంగా పీలేరు కోర్టు ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో సీనియర్ సివిల్ జడ్జి రవి మాట్లాడుతూ దైనందిన జీవితంలో యోగా సాధన ద్వారా నిత్య జీవితంలో ఉత్తమ ఫలితాలు సాధించవవచ్చన్నారు. ఆ తరువాత యోగా గురువు మనోహర్ నేతృత్వంలో జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది యోగాసనాలు వేశారు. యోగాభ్యాసం జీవితంలో సానుకూల ఆలోచనలకు దారిచూపే సాధనంగా ఉపయోగపడుతుందని పీలేరు సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా పేర్కొన్నారు. పీలేరులో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పీలేరు ఆర్యవైశ్య కళ్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో యోగా గురువు పీవీఎస్ లక్ష్మి, పీలేరు ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వీఎస్ఎన్ సంస్థల అధినేతి మాధవి ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగభ్యాసం చేశారు. స్థానికంగా ఉన్న వీఎస్ఎన్, తపస్య, భువన, సాధన, ఏవీఆర్, కాకతీయ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యాసంస్థలు, ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలల్లోని విద్యార్థులు యోగాసనాలు వేశారు. యోగసనాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కలికిరిలో: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా కలికిరి సమీపంలోని సీఆర్‌పీఎఫ్ (సీఐఏటీ-3) ప్రాంగణంలో శుక్రవారం యోగా కార్యక్రమాలను నిర్వహించారు. యోగా నిష్ణాతుల సారథ్యంలో జవాన్లు, అధికారులు ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలో సీఆర్పీఎఫ్ డీఐజీ అనుపమ్ శర్మ, కమాండెంట్ నీరజ్‌కుమార్ పాండే, డిప్యూటీ కమాండెంట్లు సంజీవ్ ఓహ్రా, కేజీ శివప్రసాద్, కేవీ ప్రసాద్, అసిస్టెంట్ కమాండెంట్ రవికుమార్‌లతోపాటు పలువురు అధికారులు, జవాన్లు పాల్గొన్నారు. స్థానిక జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. గ్యారంపల్లె ప్రభుత్వ వైద్యశాల ఆయుర్వేదిక్ యోగా వైద్యుడు డి.రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా సాధనల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ త్యాగరాజన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్, అధ్యాపకుడు రాజశేఖర్ తోపాటు పలు విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారోత్సవంతో టీడీపీ సంబరాలు


బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, జూన్ 21: అసెంబ్లీలో మదనపల్లె ఎమ్మెల్యేగా షాజహాన్‌బాషా, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రమా ణస్వీకారం సందర్భంగా టీడీపీ శ్రేణులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. మదనపల్లె పట్టణం బెంగళూరు బస్టాండులో టీడీపీ నాయకులు బాణసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా తనయుడు జునైద్ అక్బారి మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి, సమస్యల పరిష్కారంగా పనిచేస్తామన్నారు. టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్ మాట్లాడుతూ మూడో శాసనసభలో ప్రమా ణస్వీకారం చేసిన ఎమ్మెల్యేలందరికి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే ఐదేళ్ల పాలనలో ప్రజా సంక్షేమం కోసం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పనిచేస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షంషీర్, ఖాజా, ఇంతియాజ్, దాదాపీర్, బాబా, బాలు పాల్గొన్నారు.

కలికిరిలో: పీలేరు ఎమ్మెల్యేగా నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శుక్రవారం మండలంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కలికిరి, మహల్ తదితర ప్రాంతాల్లో బాణసంచా కాల్చుతూ టీడీపీకి జై కొట్టారు. మహల్ గ్రామంలోని మోదీన్ షావలీ దర్గా వద్ద సాంప్రదాయబద్దంగా ప్రార్థనలు నిర్వహించి చాదర్ సమర్పించారు. కిశోర్‌కుమార్ రెడ్డికి ఘన విజయాన్ని కట్టబెట్టిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మహల్, అద్దవారిపల్లె పంచాయతీలకు చెందిన పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి ఖాజా హుస్సేన్, మండల మైనారిటీ అధ్యక్షుడు మున్వర్ అలీ, ఐటీడీపీ అధ్యక్షుడు షబ్బీర్ హుస్సేన్, బాబ్జి, సుబ్రమణ్యం, సర్వర్, తదితరులు పాల్గొన్నారు.


మహల్‌లో దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న టీడీపీ శ్రేణులు

గుర్రంకొండలో: పీలేరు శాసనసభ్యుడిగా నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాయిని జగదీష్‌కుమార్, చలమారెడ్డి, ఎల్లుట్ల మురళీ, విశ్వనాథ్‌బాబు, రెడ్డిశేఖర్, ఆనంద్, సుధాకర్, శ్రీనివాసులు, సుబ్బరాజు, తారక, రెడ్డెప్పరెడ్డి, బయ్యారెడ్డి, రామయ్య, రామాంజులు, రమణ తదితరులు పాల్గొన్నారు.


గుర్రంకొండలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

రీలింగ్ యూనిట్లకు ఎన్‌వోసీ ఇవ్వండి


సిరికల్చర్ అధికారి రాజశేఖర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న రీలర్ల సంఘం నాయకులు

మదనపల్లె టౌన్, జూన్ 21:ముప్పై ఏళ్ల నుంచి సిరికల్చర్ యూనిట్లు నిర్వహిస్తున్న మాకు ఏపీఐఐసీ నిబంధనల మేరకు ఎన్‌వోసీ మంజూరు చేయాలని సిల్క్ రీలర్స్ ట్విస్టర్స్ సంక్షేమ సంఘం నాయకులు డీఎస్‌వో రాజశేఖర్‌రెడ్డికి విన్నవించారు. శుక్రవారం మదనపల్లెకు వచ్చిన డీఎస్‌వోను కలసిన రీలర్ల సంఘం నాయకుడు గుండా రామచంద్ర మాట్లాడుతూ 30 ఏళ్లుగా తమ అనుభవంలో ఉన్న స్థలాలను మార్కెట్ విలువ ప్రకారం చెల్లిస్తామని, ఆ స్థలాలను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వాలని కోరారు. దీనిపై డీఎస్‌వో మాట్లాడుతూ రీలర్ల విన్నపాన్ని సిరికల్చర్ కమిషనర్ కు పంపుతామని, వారు ఇచ్చే ఉత్తర్వుల మేరకు రీలర్లకు, ట్విస్టర్లకు న్యాయం చేస్తామ న్నారు. కార్యక్రమంలో డి.వెంకటరమణ, కె.చంద్రశేఖర్, రామాంజులునాయుడు, శ్రీరాములు, ప్రవీన్‌నాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

సిరికల్చర్ యూనిట్ల స్థానంలో ఇతర వ్యాపకాలు చేయవద్దు

మదనపల్లెలో రీలర్లకు కేటాయించిన సిరికల్చర్ యూనిట్లలో సిరికల్చర్‌కు అనుసంధానమైన యూనిట్లు(రీలింగ్, ట్విస్టింగ్, డైయింగ్) తప్ప ఇతర వ్యాపాకాలు, వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా సిరికల్చర్ అధికారి(డీఎస్‌వో) రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక సిరికల్చర్ ఏడీ కార్యాలయంలో పట్టణంలోని రీలర్లు, ట్విస్టర్లతో సమావేశంలో డీఎస్‌వో మాట్లాడారు. ఏడీ సరోజ మాట్లాడుతూ చాలా మంది రీలర్లు ప్రతి నెలా 10వ తేది ఇవ్వాల్సిన క్లెయిమ్‌లను ఆలస్యంగా ఇస్తున్నారన్నారు. సమావేశంలో సుబ్రమణ్యం, రీలర్లు పాల్గొన్నారు.

కిలో టమోటా రూ.72

గుర్రంకొండ, జూన్ 21:గుర్రంకొండలో కిలో టమోటా ధర రూ.72 పలికింది. ఈ లెక్కన్న 25 కిలోల టమోటా క్రేట్ ధర రూ.1800 పలికింది. ఈ క్రమంలో వారం రోజుల క్రితం వరకు కిలో టమోటా ధర రూ.30 నుంచి 40 పలికింది. ఈ నేపథ్యంలో పది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో టమోటా తోటలు దెబ్బతిన్నాయి. దీంతో అరకొరగా ఉన్న టమోటా తోటలకు తెగుళ్ల సోకడంతో కాయలు నాణ్యత లేవు. అంతేకాకుండా బయట ప్రాంతాల్లో టమోటాలకు మంచి ధర ఉండడంతో వ్యాపారులు కొనుగోలుకు పోటీపడుతున్నారు. టమోటా ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధుడు ఆత్మహత్య

మదనపల్లి అర్బన్ జూన్ 21 : మదనపల్లి మండలం అంకిశెట్టిపల్లి రామాపురంకి చెందిన ఐ.శ్రీనివాసులు (58) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇతను మునిసిపాలిటీలో నీటిసరఫరా చేసే ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఉద్యోగం తీసేస్తామని స్థానిక వ్యక్తి వచ్చి చెప్పడంతో అప్పటికే ఆర్థిక సమస్యలతో ఉన్న శ్రీనివాసులు మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నారు . తాలూక సీఐ యస్ శేఖర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు .

బొప్పాయి పంట ధ్వంసం

కలికిరి, జూన్ 21: మండలంలోని పత్తేగడ పంచాయతీ కొండకావలిపల్లె సమీపంలో బొప్పాయి పంటను ధ్వంసం చేసిన ఘటనపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. కలికిరి బీడీ కాలనీలో కాపురమున్న రైతు శేఖర్. నాగమణి దంపతులు కొండకావలపల్లె సమీపంలో 4 ఎకరాలను కౌలుకు తీసుకుని బొప్పాయి పంటను వేశారు. దాదాపు రూ.6 లక్షలు పెట్టుబడిగా పెట్టారు. బొప్పాయి పంటకు కోతకు రానున్న తరుణంలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి పంటను ధ్వంసం చేశారు. వరి పైరు కోసే కొడవళ్ళతో బొప్పాయి చెట్లకున్న కాయలను కోసి పడేశారు. ఇంకో వారం రోజుల్లో పంట కోతకు వస్తున్న దశలో దాదాపు ఐదు టన్నుల పంటను ధ్వంసం చేయడంతో కౌలు రైతు దంపతులు లబోదిబోమంటున్నారు. ఈ మేరకు పోలీసులకు శుక్రవారం కేసు దర్యాప్తులో భాగంగా పంట ధ్వంసం చేయడానికి ఉపయోగించిన కొడవళ్ళను స్వాధీనం చేసుకుని నిందితుల కోసం గాలిస్తున్నారు.

8మంది జూదర్ల అరెస్టు

పెద్దమండ్యం, జూన్ 21: మండలంలోని పాపేపల్లి గ్రామ పంచాయతీ గొల్లవానికుంట సమీపంలో ములకలచెరువు సీఐ మధు ఆధ్వర్యంలో శుక్రవారం జూదర్ల స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 8 మంది జూదర్లను అరెస్టు చేసి వారి నుంచి రూ. 1,01,060 (1లక్ష వెయ్యి అరవై రుపాయాలు) నగదు స్వాధీనం చేసుకున్నట్లు పెద్దమండ్యం ఎస్ఐ చలపతి తెలిపారు. మరో ఆరుగురు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

సర్పంచు లీవు వ్యవహారంపై డీఎల్‌పీవో విచారణ

పీలేరు, జూన్ 21: తన ప్రమేయం లేకుండానే తన సెలవును పొడిగించారని సెలవులో ఉన్న పీలేరు సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా ఇచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజ విచారణ చేపట్టారు. డీపీవో ఆదేశాలతో మదనపల్లె డీఎల్‌పీవో శుక్రవారం పీలేరు గ్రామ పంచాయతీ, పీలేరు ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న రికార్డులు పరిశీలించారు. సెలవులో ఉన్న ఇన్‌ఛార్జ్ గఫూర్‌ను తిరిగి విధుల్లోకి రప్పించి ఆయన సమక్షంలో హబీబ్ బాషా సెలవుకు సంబంధించిన రికార్డులు, గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మాన ప్రతులను పరిశీలించడమే కాకుండా వాటిని సీజ్ చేశారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తన విచారణలో పరిశీలించిన అంశాలను నివేదిక రూపంలో జిల్లా కలెక్టర్, డీపీవోకు అందజేస్తామని ఆయన తెలిపారు. తదుపరి చర్యలు వారు తీసుకుంటారని స్పష్టం చేశారు.

ఇన్‌ఛార్జ్ సర్పంచ్, వార్డు సభ్యుల వాగ్వాదం

హబీబ్ బాషా సెలవు వ్యవహారంపై విచారణకు డీఎల్‌పీవో గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా పలువురు వార్డు సభ్యులు, ఇన్‌ఛార్జ్ సర్పంచ్ భర్త మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇన్‌ఛార్జ్ సర్పంచ్ వచ్చినప్పటి నుంచి పంచాయతీలో జరుగుతున్న వ్యవహారాలపై తమకు కనీస సమాచారం ఉండడం లేదని, నిధులు రాక, వాటి వ్యయం, పంచాయతీలో నూతన గృహాల ప్లాన్ అప్రూవల్స్ గురించి తమకు తెలియనివ్వడం లేదని, జనరల్ బాడీ సమావేశం కూడా నిర్వహించడం లేదని వారు డీఎల్‌పీవో దృష్టికి తెచ్చారు.

సర్పంచు దూషించడం బాధ కలిగించింది!

డీఎల్‌పీవో విచారణ అనంతరం ఇన్‌ఛార్జ్ ఈవో గఫూర్ విలేఖరులతో మాట్లాడారు. తాను ఆరు నెలల క్రితం పీలేరుకు ఇన్‌ఛార్జ్ ఈవోగా వచ్చానని, అందులో రెండు నెలలు ఎన్నికల విధుల్లో ఉన్నానన్నారు. పంచాయతీలో ఎటువంటి అవకతవకలు జరగలేదని, హబీబ్ సెలవు వ్యవహారంలోనూ తన ప్రమేయం ఏమీ లేదన్నారు. వాస్తవాలు గ్రహించకుండా హబీబ్ తనను అకారణంగా దూషించి అసభ్యకరమైన మాటలు అన్నారని వాపోయారు.

బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

నిమ్మనపల్లి, జూన్ 21: నేను బడికి పోతా విద్యాసదస్సు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో-1 పద్మ, ఎంఈవో-2 నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6ఏళ్ల పైబడిన వారు బడికి వెళ్లే విధంగా కింది స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని గ్రామాలలో బడిఈడు పిల్లలను గుర్తించి వారిని బడికి పంపించే విధంగా చూడాలన్నారు. పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివితే వారికి ప్రభుత్వమే ఉచితంగా అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శాలెట్, తహసీల్దార్ గోపాల్‌రాజు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి


టీడీపీ కార్యకర్తలతో మాట్లాడుతున్న మలిగి మధుసూధన్‌రెడ్డి

తంబళ్లపల్లె, జూన్ 21: సమర్థవంతమైన అనుభవం ఉన్న సీఎం చంద్రబాబునాయుడు పాలనతో రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందని టీడీపీ నేత మలిగి మధుసూధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తంబళ్లపల్లె మండల కేంద్రంలో పర్యటించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు పెద్ద ఎత్తున ఆయనను కలిశారు. అనంతరం తంబళ్లపల్లె సంతోపు గంగమ్మ తిరుణాల నిర్వహించడానికి సహాయ సహకారం అందిస్తానని నిర్వాహకులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు ఉన్నారు.

చేనేత కార్మికుడి మృతికి కారకులైన వారిని అరెస్టు చేయాలి

మదనపల్లె అర్బన్, జూన్ 21: చేనేత కార్మికుడు రమేష్‌బాబు మృతికి కారుకులను వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆమేరకు తాలుకా పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తాలుకా సర్కిల్ సీఐ సద్గురుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు సాంబశివ, కృష్ణప్ప మాట్లాడుతూ చేనేత కార్మికుడు రమేష్‌బాబు కోనుగోలు చేసిన స్థలం తనకు ఇవ్వలేదని దీంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఆస్థలం అతనికి అప్పజెప్పకుండా కొందరు మోసం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్న కార్యదర్శి తిరుమల, సీపీఐ నాయకులు చంద్రశేఖర్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

గౌరవ సభగా మార్చిన రాష్ట్ర ప్రజలు


విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ యువనాయకుడు దేవేంద్ర

మదనపల్లె టౌన్, జూన్ 21: వైసీపీ పాలనలో రాష్ట్ర శాసన సభను కౌరవ సభగా మార్చగా చంద్రబాబు శపథం మేరకు రాష్ట్ర ప్రజలు ఉమ్మడి కూటమికి 164 ఎమ్మెల్యే స్థానాలను ఇచ్చి గౌరవ సభగా మార్చారని టీడీపీ యువనాయకుడు జోళిపాళ్యం దేవేంద్ర(చిన్ని) పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సీఎంగా చంద్రబాబునాయుడు ముందుచూపు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తారన్నారు. 15 ఏళ్ల తరువాత మదనపల్లె టీడీపీ జెండా రెపరెపలాడిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేషాచలపతి, ఎ.మురళి, రామాపురం శీనా, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పథకాల పేర్లు త్వరలో రాయిస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మదనపల్లె టౌన్, జూన్ 21: జిల్లాలోని 21 ఆరోగ్యశ్రీ ఆస్పత్రులు, 108, 104 వాహనాలకు కొత్త ప్రభుత్వం నిర్ణయిం చే సంక్షేమ పథకాల పేర్లను త్వరలో రాయిస్తామని, జిల్లా ఆరోగ్యశ్రీట్రస్టు సమన్వయ అధికారి డాక్టర్ లోకవర్ధన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ మారినా అధికారు తీరు మారలేదని 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవార ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మదనపల్లె సర్వజన బోధనాస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన ఆరోగ్యశ్రీ కౌంటర్‌పై వున్న వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పేరు కనిపించకుండా పేపర్లు అతికించారు. దీనిపై జిల్లా ఆరోగ్యశ్రీట్రస్టు సమన్వయ అధికారి డాక్టర్ లోకవర్ధన్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల పాత పేర్లు కనపడకుండా స్టిక్కర్లు అతికించాలని ఆరోగ్యమిత్రలను ఆదేశించామన్నారు.


సర్వజన బోధనాస్పత్రి వద్ద ఆరోగ్యశ్రీ కౌంటర్‌పై పాత పేర్లు కనిపించకుండా అతికించిన పేపర్లు

సమయపాలన పాటించాలి

ములకలచెరువు, జూన్ 18: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని ఎంపీడీవో పోలప్ప పేర్కొన్నారు. మండలంలోని చౌడసముద్రం, కాలువపల్లె సచివాలయాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

వైభవంగా పౌర్ణమి పూజలు

మదనపల్లె అర్బన్, జూన్ 21: పట్టణంలో పలు ఆలయాల్లో పౌర్ణమి పూజలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం స్థానిక అనపుటలోని గోవర్ధనగిరి శ్రీకృష్ణాలయంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలుచేసి మధ్యాహ్నాం అన్నదానం చేశారు. సాయంత్రం గిరప్రదక్షిణ నిర్వహించారు. వరాల ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.